PRGI NO:TELTEL/2010/33275
# ప్రజా కలం
తెలుగు దినపత్రిక
Digital Editions
http://prajakalam.in
epaper.prajakalam.in
paperboy.com, www.magzter.com

ప్రజాకలం పాఠకులకు,
ప్రకటనదారులకు, అధికారులకు
రాజకీయనాయకులకు, కార్యకర్తలకు
సిబ్బందికి, మిత్రులకు, మా శ్రేయోభిలాషులకు
రాఖీ పౌర్ణమి
శుభాకాంక్షలు
- ప్రజాకలం టీం

శుక్రవారం | 28-08- 2026 | సంపుటి: 17, సంచిక: 146, | నిజామాబాద్, | పేజీలు: 12, | వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

## మిర్ ఆలం చెరువుకు సర్కారు
# కొత్త హంగులు



## ఫ్యామిలీ టూరిస్టు హబ్ గా డెవలప్‌మెంట్
అకస్మికంగా పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి
గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
సస్పెన్షన్ బ్రిడ్జి, వాటర్ స్పోర్ట్స్, ఐలాండ్ల అభివృద్ధికి ప్రణాళికలు

హైదరాబాద్, ఆగస్టు 27 (ప్రజాకలం) :
చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త రూపు, సరి కొత్త హంగులు ఇవ్వాలని యోచన చేస్తోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి, వినోదం, విశ్రాంతిని ఆస్వాదించేలా దీనిని ప్రముఖ పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మిర్ ఆలం చెరువును ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం అకస్మికంగా పరిశీలించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. చెరువు చుట్టూ జరుగుతున్న పనులు, మిర్ ఆలం చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను సీఎం పరిశీలించారు. అధికారులు ఫొటో ప్రదర్శన ద్వారా పనుల పురోగతిని సీఎంకు వివరించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. చెరువు పునరుజ్జీవనం, చెరువు పరిసర ప్రాంతాలు, అందులోని ఐలాండ్ల అభివృద్ధి, చెరువుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం.. ఈ మూడు ప్రధాన అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అయితే, మిర్ ఆలం చెరువులోకి మురుగు నీరు చేరకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను సందర్శన సందర్భంగా ఆదేశించారు. చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు.

తరువాయి 2వ పేజీలో...




## తెలంగాణలో భారీగా
# ఆధునిక ధాన్య సైలోలు
### నిర్మాణం నుంచి నిర్వహణ వరకు మహిళా స్వయం సహాయక సంఘాలకు కీలక భాగస్వామ్యం

అదనంగా 5 నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ నిల్వ సామర్థ్యం లక్ష్యం
పెరుగుతున్న వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణకు అనుగుణంగా శాశ్వత నిల్వ వ్యవస్థ
ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్ నుంచి డిజిటల్ మానిటరింగ్ వరకు అత్యాధునిక సాంకేతికత
బియ్యం మిల్లర్ల నుంచి బకాయిల వసూలుకు పటిష్ట కార్యాచరణ
జీఈఎం, తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పారదర్శకంగా ధాన్యం వేలం
నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 27 (ప్రజాకలం) :
తెలంగాణలో ఏటేటా విస్తరిస్తున్న వరి సాగు, గణనీయంగా పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి, ప్రభుత్వ సేకరణ అవసరాలకు దీర్ఘకాలిక పరిష్కారంగా అత్యాధునిక ధాన్య సైలోల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థను ఆదేశించారు. రాష్ట్రంలో అదనంగా 5 లక్షల నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ ధాన్య నిల్వ సామర్థ్యాన్ని సృష్టించే

తరువాయి 2వ పేజీలో...

# లంచాలకు అడ్డాగా మైన్స్ కార్యాలయం
### భూపాలపల్లి జిల్లా మైన్స్ ఏడి కార్యాలయం, 12 చోట్ల ఏసీబీ దాడులు...
### రికార్డులు జల్లెడ పడుతున్న ఏసీబీ అధికారులు ..





జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 27 ప్రజాకలం ప్రతినిధి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గనులు, భూగర్భ శాఖ కార్యాలయం లంచాలకు అడ్డాగా మారిందా? అనే అనుమానాల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు రంగంలోకి దిగారు. జిల్లా సహాయ సంచాలకులు బొజ్జ జయరాజ్ పై వచ్చిన అవినీతి ఆరోపణలతో గురువారం ఉదయం నుండి 12 ప్రాంతాల్లో ఏకకాలంలో మెరుపు దాడులు చేపట్టారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్ బోడుప్పల్ లోని ఆయన సొంత నివాసంతో పాటు భూపాలపల్లి కలెక్టరేట్ లోని మైన్స్ ఏడీ కార్యాలయంలో తనిఖీలు ముమ్మరంగా కొనసాగాయి. సూర్యాపేట, తాండూరు తదితర ప్రాంతాల్లోని బంధువులు, సన్నిహితుల ఇళ్లలోనూ సోదాలు చేపట్టారు. భూపాలపల్లితో పాటు ములుగు జిల్లా ఇంచార్జిగా ఉన్న జయరాజ్ ఇసుక అక్రమ రవాణాదారులతో కుమ్మక్కై భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని, ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని ఏసీబీకి పక్కా సమాచారం ఉంది. దీంతో ఆయన కార్యాలయంలోని ఫైళ్లు, రికార్డులు, అనుమతి పత్రాలు, ఇసుక రవాణాకు సంబంధించిన దస్త్రాలను ఏసీబీ ఇన్స్పెక్టర్ బృందం జల్లెడ పడుతోంది.కార్యాలయంలోని ఓ ఉద్యోగిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ సోదాల్లో పెద్ద మొత్తంలో నగదు, బంగారం, భూముల రిజిస్ట్రేషన్ పత్రాలు, బినామీ ఆస్తుల వివరాలు లభించినట్లు తెలుస్తోంది. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న కొద్ది రోజులకే ఆయనపై ఏసీబీ దాడులు జరగడం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. సోదాలు పూర్తయిన తర్వాత అక్రమాస్తుల వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

## కలం కౌంటర్




## విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం
# అత్యధిక ప్రాధాన్యత
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

- విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి స్కిల్ యూనివర్సిటీ, ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లు
- అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పింఛన్
- రూ.30 లక్షలతో గోపాలపురం పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

**పాలేరు ఆగస్టు 27(ప్రజా కలం న్యూస్ )**
విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ పరిధి గోపాలపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రూ.30 లక్షలతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. విద్యార్థుల కోసం తాత్కాలిక షెడ్డు నిర్మించేందుకు టీచర్ సుమారు రూ.40 వేల సొంత డబ్బును వెచ్చించడం అభినందనీయమని అన్నారు. పిల్లల సంక్షేమం కోసం తన సొంత డబ్బును ఖర్చు చేసి తాత్కాలిక వసతి ఏర్పాటు చేసిన టీచర్ ను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా విద్య, వైద్య రంగాలను అత్యంత ప్రాధాన్యతా రంగాలుగా భావించి పనిచేస్తోందని



మంత్రి అన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించామని, స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా, ఉద్యోగాలు కల్పించే పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో ఒక ఏటిసి ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...



## ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే
# సంస్కృతిని ప్రోత్సహించాలి
### 20వ గ్రాండ్ నర్సరీ మేళాను ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, ఆగస్టు 27 (ప్రజాకలం) :
ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగర జీవనంలో పెరుగుతున్న ఒత్తిడి, కాలుష్యం నేపథ్యంలో హరిత వాతావరణాన్ని పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఐమ్యాక్స్ థియేటర్ పక్కన హెచ్ఎండీఏ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన 20వ గ్రాండ్ నర్సరీ మేళా - ఆల్ ఇండియా హార్టికల్చర్ & అగ్రికల్చర్ షోను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ ని పరిశీలించిన

తరువాయి 2వ పేజీలో...

## నేపాల్ వరదల నేపథ్యంలో తెలంగాణ
# ప్రజల భద్రతకు ప్రత్యేక చర్యలు

నేపాల్‌లో చిక్కుకున్న 23 మంది తెలంగాణ వాసులను ప్రాథమికంగా గుర్తించాం
వారి వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపించాం
న్యూఢిల్లీ లోని తెలంగాణ భవన్, సచివాలయంలో ప్రత్యేక హెల్ప్‌లైన్, కంట్రోల్ రూమ్‌లు
కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయంతో నిరంతర సమన్వయం
చిక్కుకున్న వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఆగస్టు 27 (ప్రజాకలం) :
నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదలు, ఫ్లాష్‌ఫ్లడ్స్ నేపథ్యంలో అక్కడ ఉన్న తెలంగాణకు చెందిన పర్యాటకులు, యాత్రికులు, ఇతర పౌరుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసుల కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు అందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ప్రాథమికంగా 23 మంది తెలంగాణ వాసులను గుర్తించినట్లు మంత్రి వెల్లడించారు. గుర్తించిన వారి వివరాలను కేంద్ర విదేశాంగ శాఖకు పంపించడం జరిగిందని తెలిపారు. వారి ప్రస్తుత పరిస్థితి, ఆచూకీ తెలుసుకోవడంతో పాటు అవసరమైన సహాయం అందించేందుకు కేంద్ర విదేశాంగ శాఖ, కాఠ్మాండు భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేస్తోందని తెలిపారు. నేపాల్‌లో నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక




హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా హైదరాబాద్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో సాధారణ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, బాధితుల కుటుంబాల నుంచి సమాచారం

తరువాయి 2వ పేజీలో...

## మిర్ ఆలం చెరువుకు సర్కారు

# కొత్త హంగులు

మొదటి పేజీ తరువాయి...

చెరువు పునరుజ్జీవనంతో పాటు నీటి నాణ్యతను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

**వాటర్ స్పోర్ట్స్‌కు డిజైన్...** మిర్ ఆలం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. అవసరమైన సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, అడ్వెంచర్ కార్యకలాపాలకు అవకాశాలను పరిశీలించాలన్నారు. దీంతో యువతతో పాటు కుటుంబాలకు కూడా ఆకర్షణీయమైన వినోద కేంద్రంగా మిర్ ఆలం మారుతుందని అభిప్రాయపడ్డారు. చెరువు చుట్టూరా ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వినోద, కార్యకలాపాల కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. పాదచారులకు అనుకూలంగా వాకింగ్, పబ్లిక్ స్పేస్‌లను తీర్చిదిద్దడంతో పాటు రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరచనున్నారన్నారు.

ఐలాండ్లకూ కొత్త రూపు

మిర్ ఆలం చెరువులో ఉన్న ఐలాండ్లను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్(టెంట్లు వేయడం), ఇతర పర్యాటక కార్యకలాపాలకు ఈ ప్రాంతాన్ని వినియోగించుకునే అవకాశాలను అధికారులను పరిశీలించాలని చెప్పారు. వెడ్డింగ్, ఈవెంట్ డెస్టినేషన్ల ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల అభివృద్ధిలో పీపీపీ విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు.

జూ పార్కుతో సమగ్ర పర్యాటక అనుసంధానం

సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని అనుసంధానం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూ సందర్శన, ప్రకృతి, చెరువు అందాలు, కుటుంబ వినోదం అన్నీ ఒకే పర్యాటక అనుభవంగా అందించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ట్యాంక్ పునరుజ్జీవనం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం రూపుదిద్దుకుంటుందన్నారు.

**సస్పెన్షన్ బ్రిడ్జి పనుల్లో 50 శాతం పురోగతి**

అయితే, మిర్ ఆలం ట్యాంక్‌పై నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. ఆగస్టు 27, 2026 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 పూర్తయ్యాయి. అంటే 50.18 శాతం పనులు పూర్తయ్యాయి. 62 పైల్ క్యాప్స్‌లో 28 పూర్తికాగా, 45.16 శాతం పురోగతి నమోదైంది. 62 పియర్-కమ్-పియర్ క్యాప్స్‌లో ఇప్పటివరకు ఆరు పూర్తయ్యాయి. విమానాశ్రయానికి సమీపంలో ఉన్న మిర్ ఆలం చెరువును పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సందర్భంగా సూచించారు. చారిత్రక చెరువు, పచ్చని పరిసరాలు, నెహ్రూ జూ పార్కు సమీపం, ఐలాండ్లు, వాటర్ స్పోర్ట్స్, కుటుంబ వినోదం, ఫుడ్‌కోర్టులు, ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జితో మిర్ ఆలం ట్యాంక్‌కు సరికొత్త గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. సమగ్ర అభివృద్ధి పూర్తయితే హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే ప్రముఖ పర్యాటక కేంద్రంగా మిర్ ఆలం ట్యాంక్ మారనుంది. కుటుంబం మొత్తం ఒకే చోట రోజంతా ప్రకృతి, వినోదం, జలక్రీడలు, విశ్రాంతిని ఆస్వాదించేలా మిర్ ఆలం చెరువును తీర్చిదిద్దనున్నారు.

# తెలంగాణలో భారీగా ఆధునిక ధాన్య సైలోలు

మొదటి పేజీ తరువాయి...

దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

ముఖ్యంగా ఈ సైలోల నిర్మాణం, నిర్వహణలో మహిళా స్వయం సహాయక సంఘాలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు కొత్త మార్గాలను తెరవడంతో పాటు, రాష్ట్ర ఆహార భద్రతకు అవసరమైన శాశ్వత మౌలిక సదుపాయాల నిర్మాణంలో వారిని భాగస్వాములను చేసే నమూనాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

పౌర సరఫరాల సంస్థ కార్యకలాపాలపై సీనియర్ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి, సేకరణకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని విస్తరించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. మెరుగైన సాగునీటి సదుపాయాలు, సాగు విస్తీర్ణం పెరగడం, కనీస మద్దతు ధరకు ప్రభుత్వం ధాన్యం సేకరిస్తుండడంతో తెలంగాణలో వరి ఉత్పత్తితో పాటు ధాన్యం కొనుగోళ్లు కూడా ఏటేటా పెరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సేకరించిన ధాన్యాన్ని సురక్షితంగా, శాస్త్రీయంగా నిల్వ చేసేందుకు వ్యూహాత్మక ప్రాంతాల్లో ఆధునిక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయడం అత్యవసరమైందన్నారు.

సంప్రదాయ గోదాములతోనే సరిపోదు

భవిష్యత్ అవసరాలను కేవలం సంప్రదాయ గోదాములతో తీర్చడం సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణకు ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్, శాస్త్రీయ సంరక్షణ, యాంత్రిక రవాణా, డిజిటల్ పర్యవేక్షణ వంటి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలతో కూడిన నిల్వ నెట్‌వర్క్ అవసరమన్నారు.

తేమ, పురుగులు, ఇతర నిల్వ సంబంధిత కారణాలతో ధాన్యం నష్టపోకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ధాన్యం నిల్వ నుంచి తరలింపు వరకు ప్రతి దశలో నాణ్యత, భద్రత, సామర్థ్యాన్ని పెంచే విధంగా సైలో వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు.

మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామస్థాయి సంస్థలు, పౌర సరఫరాల సంస్థ భాగస్వామ్యంతో ఆధునిక సైలోల నిర్మాణం, నిర్వహణ చేపట్టేందుకు అనువైన నమూనాలను అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇందులో పౌర సరఫరాల సంస్థ, మహిళా సంఘాలు, ఇతర భాగస్వామ్య సంస్థల బాధ్యతలను స్పష్టంగా నిర్వచించాలని చెప్పారు. సైలోలు ఆర్థికంగా స్వయం సమర్థంగా, వృత్తిపరంగా నిర్వహించబడేలా తగిన ఆర్థిక, కార్యాచరణ నమూనాలను రూపొందించాలన్నారు.

"రాష్ట్ర ధాన్య నిల్వ మౌలిక సదుపాయాలను కేవలం వచ్చే కొనుగోలు సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని కాదు... రాబోయే దశాబ్దాల అవసరాలను ముందుగానే అంచనా వేసి నిర్మించాల్సిన ఆవశ్యకత ను ఆయన వివరించారు.

ప్రస్తుతం తెలంగాణలో పౌర సరఫరాల సంస్థ, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, కేంద్ర గిడ్డంగుల సంస్థ, భారత ఆహార సంస్థ, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రైవేటు పెట్టుబడిదారుల గోదాముల ద్వారా ధాన్యం నిల్వ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు సొంతంగా సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ, ప్రతి సీజన్‌లో భారీగా సేకరిస్తున్న ధాన్యాన్ని నిల్వ చేసేందుకు ఇతర సంస్థలు, అద్దె గోదాములపై ఆధారపడాల్సి వస్తోందన్నారు.

90 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు సిద్ధమైన వ్యవస్థ

ఇటీవలి ధాన్యం సేకరణ పరిమాణమే రాష్ట్ర నిల్వ వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిడిని తెలియజేస్తోందని మంత్రి చెప్పారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో పౌర సరఫరాల సంస్థ 90 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించేందుకు సిద్ధమైందని, సీజన్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా తక్షణమే సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

భారీ స్థాయిలో పెరుగుతున్న ధాన్యం సేకరణకు, అందుబాటులో ఉన్న శాశ్వత శాస్త్రీయ నిల్వ సామర్థ్యానికి మధ్య పెరుగుతున్న అంతరం కొత్త సైలోల నిర్మాణం ఎంత అత్యవసరమో స్పష్టం చేస్తోందన్నారు.

బియ్యం మిల్లర్ల బకాయిల వసూలుకు పటిష్ట వ్యూహం

డిఫాల్టర్ కస్టమ్ రైస్ మిల్లర్ల నుంచి రావాల్సిన బకాయిల వసూలును వేగవంతం చేసేందుకు సమర్థవంతమైన కార్యాచరణ రూపొందించాలని మంత్రి పౌర సరఫరాల సంస్థను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలు, ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా బకాయిల వసూలు వ్యూహాన్ని సిద్ధం చేయాలని చెప్పారు. డిఫాల్టర్లపై చేపట్టే న్యాయపరమైన, విజిలెన్స్, పరిపాలనాపరమైన చర్యలన్నింటిలోనూ ప్రజాధనం తిరిగి రాబట్టడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.

ధాన్యం వేలంలో పూర్తి పారదర్శకత

ధాన్యం నిల్వల ప్రతిపాదిత వేలంపైనా మంత్రి సమీక్షించారు. తదుపరి విడత వేలం ప్రారంభించే ముందే లాట్ పరిమాణాలు, బిడ్డింగ్ నిబంధనలు, వేలం నిర్వహించే వేదికలను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. వేలం ప్రక్రియలో పారదర్శకత, ఏకరూపత, విస్తృత భాగస్వామ్యం ఉండేలా గవర్నమెంట్ ఈ-మార్కెట్‌ప్లేస్, తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ వంటి గుర్తింపు పొందిన ప్రభుత్వ వేదికలను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తికి తగిన నిల్వ సామర్థ్యాన్ని సృష్టించడం ద్వారా రైతుల కష్టార్జిత పంటకు భద్రత కల్పించడంతో పాటు, ప్రజాధనాన్ని కాపాడటం, నిల్వ నష్టాలను తగ్గించడం, పౌర సరఫరాల వ్యవస్థను మరింత ఆధునికంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో పౌర సరఫరాల అదనపు సంచాలకులు రోహిత్ సింగ్, పౌర సరఫరాల సంస్థకు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## నేపాల్ వరదల నేపథ్యంలో తెలంగాణ

# ప్రజల భద్రతకు ప్రత్యేక చర్యలు

మొదటి పేజీ తరువాయి...

సేకరించి సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. నేపాల్ లో నెలకొన్న పరిస్థితులు, అక్కడ తెలంగాణ వాసులు ఎంతమంది ఉండే అవకాశం ఉంది వంటి అంశాలపై డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారులతో గురువారం నాడు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..

నేపాల్‌లో నెలకొన్న పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా, సీరియస్‌గా పర్యవేక్షిస్తోంది. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు అందించిన సమాచారంతో 23 మంది తెలంగాణ వాసులను ప్రాథమికంగా గుర్తించాం.

గుర్తించిన 23 మంది వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపించాం. వారి ఆచూకీ, భద్రతపై కేంద్ర అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నాం.

ఇంకా ఎవరైనా తెలంగాణ వాసులు నేపాల్‌లో చిక్కుకున్నట్లయితే వారి కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వానికి సమాచారం అందించాలి. బాధితుల పేరు, పాస్‌పోర్ట్ వివరాలు, మొబైల్ నంబర్, నేపాల్‌లో చివరిగా ఉన్న ప్రదేశం, ట్రావెల్/టూర్ ఆపరేటర్ వివరాలు, కుటుంబ సభ్యుల సంప్రదింపు నంబర్లు అందిస్తే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

తెలంగాణ భవన్ అధికారులు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూా), కాఠ్మాండు భారత రాయబార కార్యాలయం, నేపాల్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు.

పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తంగా ఉండి, రాష్ట్రానికి చెందిన ప్రతి ఒక్కరి భద్రతకు అవసరమైన సహాయాన్ని అందిస్తుంది.

తెలంగాణ భవన్ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు
9871999044
9949351270
9618597969

తెలంగాణ సచివాలయం ప్రత్యేక కంట్రోల్ రూమ్

నేపాల్‌లో చిక్కుకున్న లేదా ప్రభావితమైన తెలంగాణ ప్రజల కుటుంబ సభ్యులు సమాచారం కోసం కింది అధికారులను సంప్రదించవచ్చు:

ఎస్. లక్ష్మీనారాయణ – అసిస్టెంట్ సెక్రటరీ
9885371189
కె.శ్రీనివాస్ రెడ్డి – సెక్షన్ ఆఫీసర్
7997959754
ఇ. చిట్టిబాబు – సెక్షన్ ఆఫీసర్
9440854433

నేపాల్‌లో చోటుచేసుకున్న విషాదకర పరిస్థితులపై మంత్రి పొంగులేటి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విపత్తులో చిక్కుకున్న తెలంగాణ ప్రజలకు సాధ్యమైనంత త్వరగా సహాయం అందేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని,

నేపాల్‌లో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

# విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత

మొదటి పేజీ తరువాయి...

ఆయా కేంద్రాల ద్వారా యువతకు ఆధునిక నైపుణ్యాలతో కూడిన కోర్సుల్లో శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు పొందడంతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏటిసి లను దూరదృష్టితో ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

తిరుమలాయపాలెం మండలంలో వైద్య రంగానికి కూడా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, కొత్త ఆసుపత్రుల నిర్మాణంతో పాటు ఆసుపత్రుల్లో వైద్యులు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని మంత్రి అన్నారు. గత రెండున్నరేళ్లలో మహిళా సంఘాలకు రూ.63 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని తెలిపారు. రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తున్నా మని, కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్నా మని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మొదటి దశలో ఇళ్లను మంజూరు చేశామని, ప్రస్తుతం రెండో దశ ఇళ్లను అందిస్తున్నామని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని స్పష్టం చేశారు.

కొత్త పింఛన్ల మంజూరు కోసం ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్త పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గోపాలపురం పాఠశాల భవనం అత్యంత దెబ్బతిన్న స్థితిలో ఉందని, మరమ్మతులు చేపట్టే అవకాశం లేకపోవడంతో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో ఈ పాఠశాలను చేర్చలేదని తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు రూ.30 లక్షలతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, ప్రస్తుతం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించామని చెప్పారు.

పాఠశాలలో విద్యార్థుల కోసం టీచర్ సుమారు రూ.30 వేల సొంత నిధులతో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేశారని కలెక్టర్ తెలిపారు. టీచర్ సేవాభావాన్ని మంత్రి అభినందించారని పేర్కొన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తిరుమలాయపాలెం మండల ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహాశీల్దార్ విల్సన్, ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ నల్లమల్ల కీర్తి నీరన్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నరు.

# ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాలి

మొదటి పేజీ తరువాయి...

మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. 2015 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది జనవరి, ఆగస్టు నెలల్లో క్రమం తప్పకుండా నర్సరీ మేళాను నిర్వహించడం అభినందనీయమని మంత్రి అన్నారు. ప్రజలకు వివిధ రకాల మొక్కలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఇంటి స్థాయిలో గార్డెనింగ్‌ను ప్రోత్సహించడానికి ఈ మేళా మంచి అవకాశంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఆగస్టు 27 నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరగనున్న ఈ మేళాలో 110కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ నర్సరీల నుంచి తీసుకొచ్చిన అనేక రకాల మొక్కలను ప్రజలకు అందుబాటులో ఉంచారు. టెర్రస్ గార్డెనింగ్, వెర్టికల్ గార్డెనింగ్, హైడ్రోపోనిక్ గార్డెనింగ్‌కు అవసరమైన మొక్కలతో పాటు పూల మొక్కలు, మెడిసినల్ ప్లాంట్స్, బోన్సాయి, అలంకరణ మొక్కలు వంటి విభిన్న రకాల మొక్కలు మేళాలో అందుబాటులో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్, కోల్కతాతో పాటు ఢిల్లీ, హర్యానా, గుజరాత్, ముంబయి, బెంగళూరు, పూణే, షిర్డీ, చెన్నై, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి మొక్కలను తీసుకొచ్చారు. నాగాలాండ్ నుంచి వచ్చిన కాక్టస్ వంటి ప్రత్యేక ఆకర్షణ కలిగిన మొక్కలు కూడా మేళాలో ఉన్నాయని వివరించారు.

సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా రూ.20 నుంచి రూ.2.5 లక్షల విలువైన మొక్కల వరకు వివిధ రకాల మొక్కలు మేళాలో లభిస్తున్నాయని మంత్రి తెలిపారు. మొక్కల పెంపకానికి అవసరమైన మెటీరియల్స్, ఆర్గానిక్ ఎరువులు, ఫెర్టిలైజర్లు, టెర్రకోట కుండీలు తదితర సామగ్రి కూడా ఒకే చోట లభించడం మేళా ప్రత్యేకతగా పేర్కొన్నారు.

దేశంలోని వివిధ ప్రాంతాల్లో లభించే అరుదైన, ప్రత్యేకమైన మొక్కలను హైదరాబాద్ నగర ప్రజలకు ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మొక్కలు ఇంటి అందాన్ని పెంచడమే కాకుండా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయని మంత్రి తెలిపారు. ఇంటి ఆవరణలో మొక్కలు పెంచడం ద్వారా ఒత్తిడి తగ్గి మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఇంటి పరిసరాల్లో చల్లని వాతావరణం ఏర్పడటానికి కూడా మొక్కలు దోహదపడతాయని అన్నారు.

మొక్కల పెంపకాన్ని అలవాటుగా చేసుకోవడం ద్వారా సమయాన్ని సృజనాత్మకంగా వినియోగించుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు. నగర జీవనంలో పెరుగుతున్న ఒత్తిడి, కాలుష్యం నేపథ్యంలో హరిత వాతావరణాన్ని పెంచుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మేళా ద్వారా ప్రజలకు మొక్కలపై అవగాహన పెరగడంతో పాటు ఇంటి స్థాయిలో గార్డెనింగ్‌ను ప్రోత్సహించడానికి మంచి అవకాశం లభిస్తుందని మంత్రి అన్నారు. హైదరాబాద్ నగర వాసులందరూ ఈ ఐదు రోజుల నర్సరీ మేళాను సందర్శించి, తమకు నచ్చిన మొక్కలను కొనుగోలు చేసి తమ ఇళ్లను మరింత పచ్చదనంతో నింపాలని కోరారు.

## దేవదుర్గ గని నుంచి విరివిగా బంగారం, రాగి తీసి

# దేశ సంపదను పెంచుదాం

### - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు

**దేవదుర్గ లో కాపర్, గోల్డ్ మైనింగ్ అన్వేషణ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించిన డిప్యూటీ సీఎం**

**దేవదుర్గ లో సైట్ క్యాంప్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం**

**స్థానికుల సహకారంతో త్వరితగతిన ఖనిజ అన్వేషణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలి**



హైదరాబాద్, ఆగస్టు 27 (ప్రజాకలం) :

కర్ణాటకలోని దేవదుర్గ గని నుంచి పెద్ద ఎత్తున బంగారం, రాగి ఖనిజాలను వెలికితీసి దేశ సంపదను పెంపొందించడానికి మనమందరం కలిసికట్టుగా కృషి చేద్దామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

రాయచూరు జిల్లా, దేవదుర్గ తాలూకా లింగదహళ్ళి గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కాపర్, గోల్డ్ మైనింగ్ అన్వేషణ కార్యక్రమాన్ని అధికారికంగా డిప్యూటీ సీఎం ప్రారంభించారు అనంతరం ఖనిజ అన్వేష ప్రదేశాలను ఆయన క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.

దాదాపు 136 సంవత్సరాల సుదీర్ఘ మైనింగ్ అనుభవం ఉన్న సింగరేణి కాలరీస్ సంస్థ, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో దేవదుర్గ్ బ్లాక్ ఎక్స్‌ప్లోరేషన్ (అన్వేషణ) హక్కులను దక్కించుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

ఈ క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఆయన మాట్లాడుతూ, అన్వేషణ పనులను సింగరేణి సంస్థ త్వరలోనే వేగవంతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతమై ఇక్కడ బంగారం, రాగి విరివిగా లభిస్తే ప్రాంతీయంగా నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభించడమే కాకుండా ఈ ప్రాంతం శీఘ్రగతిన అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పనుల పర్యవేక్షణ కోసం అధికారులు ఇక్కడే ఉండేలా సింగరేణి ఆధ్వర్యంలో త్వరలోనే ఒక సైట్ ఆఫీస్‌ను, అలాగే రాకపోకల సౌకర్యార్థం హెలిప్యాడ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించిన వెంటనే ఈ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు.

అలాగే, కృష్ణానదికి ఇరువైపులా ఉన్న తెలుగు, కర్ణాటక ప్రజల మధ్య విడదీయరాని చారిత్రక, సాంస్కృతిక బంధం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలోనే భాగమైనందున మన మూలాలు ఒక్కటేనని గుర్తుచేశారు., స్థానిక ప్రజల అండదండలతో ఈ ప్రాజెక్టును త్వరలోనే విజయవంతంగా పూర్తి చేసి దేశ సంపదను పెంచడానికి ఉపయోగపడదామని పిలుపునిచ్చారు.

ఈ అన్వేషణ రెండు రాష్ట్రాల పురోగతికి, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎంతగానో దోహదపడుతుందని ఆకాంక్షించారు.

దేవదుర్గ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి అన్నారు. ఈ ప్రాంతంలో గతంలో సిఐ గా పని చేసిన పని చేశానని ప్రస్తుతం సింగరేణి సంస్థ చైర్మన్ డైరెక్టర్ గా ఇక్కడ బంగారం రాగి కనీసం పనులను స్థానికుల సమక్షంలో ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు ఈ పరమానంద స్వామి గుట్ట పరమానంద స్వామి ఆశీస్సులతో ఇక్కడ బంగారు నిక్షేపాలు లభించాలని స్థానికులకు ఉపాధి అవకాశాలు కలగాలని ఆకాంక్షించారు

రాయచూర్ లో బంగారం, రాగి ఖనిజ బ్లాకును పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

లింగదహళ్ళి గ్రామానికి చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకుహా కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు తనయుడు, కాంగ్రెస్ నాయకుడు రవి బోసురాజు మరియు స్థానిక సర్పంచ్ ఎల్లమ్మ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా లింగదహళ్ళిలోని దేవదుర్గ బంగారు ఖనిజ బ్లాక్ వ్యూ పాయింట్ నుంచి ఖనిజ అన్వేషణహా చేపట్టనున్న ప్రాంతాలను ఉప ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడి బ్లాక్ నుంచి సింగరేణి అధికారులు సేకరించిన వివిధ రకాల ఖనిజ నమూనాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించబోయే బంగారం, రాగి వెలికితీత, అన్వేషణ ప్రక్రియల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరేణి అధికారులు మరియు కర్ణాటక రాష్ట్ర అధికార యంత్రాంగంతో డిప్యూటీ సీఎం సమీక్షా సమావేశం నిర్వహించి ఖనిజ అన్వేషణపై దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి పర్యటన ముగించుకుని లింగదహళ్ళి గ్రామంలోని చారిత్రక నేపథ్యం కలిగిన శ్రీ పరమానంద శివాలయాన్ని దర్శించుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ చైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ సీకే వెంకటేశ్వర్లు, జీఎం పంకజ్ కుల శ్రేష్ట, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, సింగరేణి ఉన్నతాధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## భాదిత కుటుంబాలకు ఏనుగు మనోహర్ రెడ్డి పరమార్శ



రుద్రంగి, ఆగష్టు 27, (ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రానికి చెందిన మహ్మద్ సదుల్లా,హసీనా, రీమ్సా, హసీనా గత నాలుగు రోజుల క్రితం కారు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు. ఒకే ప్రమాదంలో నలుగురు మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ కుటుంబానికి మనోధైర్యం కలిపించాలని ప్రార్థించారు. ఆయన వెంట సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం, కంటే రెడ్డి నాయకులు గంగం మహేష్, దయ్యాల కమలాకర్, దయ్యాల నారాయణ, ఉప్పులూటి గణేష్, సింగారపు గంగారెడ్డి, కదాసు లక్ష్మణ్, తర్రే గంగారెడ్డి, కోడిగంటి శ్యామ్, గెంటేప్రశాంత్, రగుట్ల నరేష్ లు ఉన్నారు.

## చిన్న మెట్‌పల్లి గ్రామ సభలో పాల్గొన్న జువ్వాడి

### ఓటరు జాబితాలో వివరాలను ప్రతి ఒక్కరూ పరిశీలించాలి

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజా కలం) కోరుట్ల మండలం చిన్న మెట్‌పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్



చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలో నమోదైన వివరాలను ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని సూచించారు. పేర్లు, చిరునామా, వయస్సు తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సరిచేసుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జువ్వాడి నర్సింగ్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో,ఎమ్మార్వో, గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లోని నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న జువ్వాడి నర్సింగ్ రావు



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజాకలం) మెట్‌పల్లి పట్టణంలోని జువ్వాడి భవన్‌లో రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సోదరీమణులు జువ్వాడి నర్సింగ్ రావుతో పాటు మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు ఆత్మీయంగా రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను జువ్వాడి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ్ రావు మహిళా సోదరీమణులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, సౌభాగ్యం, శాంతి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. మహిళల భద్రత, సంక్షేమం, గౌరవం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సోదరీమణులు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో రాఖీ పండుగ సందడి.. కిక్కిరిసిన బజార్లు

బెల్లంపల్లి టౌన్ ఆగస్టు 27 (ప్రజాకలం ప్రతినిధి) బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన రాఖీ స్టాళ్ల వద్ద మహిళలు సందడి చేశారు.రాఖీల కొనుగోళ్ల కోసం మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పట్టణంలోని బజార్ ఏరియా ప్రాంతం కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుండి సోదరులకు రాఖీ కట్టేందుకు మహిళల రాకపోకలతో సందడి నెలకొంది.రాఖీలు కొనుగోలు చేసేందుకు మహిళలు స్టాళ్ల వద్ద బారులు తీరారు.దీంతో ప్రధాన రహదారులు,కూడళ్లు రద్దీగా కనిపించాయి.రాఖీలు విక్రయించేందుకు వ్యాపారులు పెద్ద సంఖ్యలో స్టాళ్లు ఏర్పాటు చేశారు.వివిధ రకాల రాఖీలు అందుబాటులో ఉంచడంతో మహిళలు తమ సోదరుల కోసం రాఖీలను కొనుగోలు చేశారు.ప్రతి ఏటా బెల్లంపల్లిలో రాఖీ పౌర్ణమి పండుగకు 5 రోజుల ముందు నుంచి హడావుడి ఉంటుంది కాగా గత రెండు రోజులు వర్షాలు కురవడంతో మహిళలు దుకాణాల వద్దకు రాకపోవడంతో వ్యాపారులు దిగులు చెందారు.గురువారం వర్షం లేకపోవడం,రాఖీ పౌర్ణమి కి ఒక రోజు మాత్రమే ఉండడంతో మహిళల రాకతో వ్యాపారులు సంతోషం వ్యక్తం చేశారు.దీంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొందని పేర్కొన్నారు.



## లక్ష్య సాధనకు కృషి, పట్టుదల అవసరం

### ఉచిత పోలీస్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి - జగిత్యాల రూరల్ సిఐ దామెర సుధాకర్

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజాకలం)

కృషి పట్టుదల ఉంటే మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతామని జగిత్యాల రూరల్ సిఐ దామెర సుధాకర్ అన్నారు.వాల్మీకి ఆవాసం సేవా భారతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత పోలీసు శిక్షణ శిబిరాన్ని రూరల్ సీఐ సుధాకర్ సందర్శించి అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ప్రణాళికాబద్ధంగా చదవడంతో పాటు శారీరక కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించినట్లయితేనే పోటీ పరీక్షల్లో విజయం సాధించగలుగుతారని వివరించారు.

ఈ మూడు నెలల కాలంలో ఎలాంటి ఆకర్షణలకు లోను కాకుండా ఉద్యోగం సాధించాలనే పట్టుదల ఉండాలన్నారు. పోలీసు వృత్తి అనేది సమాజంలో ఒక బాధ్యత గల ఉద్యోగం అని దీన్ని సాధించడానికి శారీరక శ్రమతో పాటు విషయ పరిజ్ఞానం, క్రమశిక్షణ కఠోర పరిశ్రమ కూడా అవసరమని తెలిపారు. ఎంతోమంది గ్రామీణ యువకులకు పోలీస్ ఉద్యోగం మీద మక్కువ ఉన్నప్పటికీ ఆర్థిక భారంతో కూడిన కోచింగ్ తీసుకోలేని పరిస్థితిలో వారి పోలీస్ ఉద్యోగం కల నెరవేరడం లేదన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో వాల్మీకి ఆవాసం ద్వారా హైదరాబాద్ స్థాయిలో శిక్షణనిస్తున్నారని దీన్ని సద్వినియోగం చేసుకొని పోలీసు ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. దేశ సేవ, సమాజ సేవ చేయాలనే ఉద్దేశంతో శిక్షణ పొందడా నికి వచ్చిన యువకులు క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా చదువుకొని





లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా భారతి జిల్లా అధ్యక్షులు ఎస్పి సుబ్రహ్మణ్యం, వాల్మీకి ఆవాస కార్యదర్శి మదన్మోహన్రావు, కమిటీ సభ్యులు సంపూర్ణ చారి, చంద్రశేఖర్, బొమ్మెర సత్యనారాయణ, , సురేష్, సుమన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి

### రాయికల్ పట్టణం లో 'సర్' ముసాయిదా వార్డు సభ లో పాల్గొన్న అదనపు కలెక్టర్



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజాకలం)

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో సర్ ముసాయిదా వార్డు సభ లో జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత మాట్లాడుతూ గ్రామసభల ద్వారా ఓటర్ల జాబితా వివరాలను ప్రజలకు చదివి వినిపించి, పారదర్శకంగా పరిశీలన చేపడుతున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన, మరణించిన ఓటర్ల వివరాలను సంబంధిత ఆధారాలతో నిర్ధారించిన అనంతరం నిబంధనల ప్రకారం జాబితా నుంచి తొలగించే ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ వివరాలపై ప్రజల నుంచి అభ్యంతరాలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. 2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. సంబంధిత నోటీసులు వారం రోజుల్లో ఓటర్ల ఇళ్లకు చేరుతాయని, నోటీసులు అందుకున్న వారు అందులో పేర్కొన్న గడువులోగా అవసరమైన ఆధారాలను సంబంధిత బిఎల్ఓ లకు సమర్పించాలని సూచించారు.అదేవిధంగా ఓటర్ల డేటాలో గుర్తించిన అసాధారణతలు ఉన్న వారికి కూడా నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పుట్టిన తేదీల్లో తప్పులు, కుటుంబ సభ్యుల మధ్య వయస్సుకు సంబంధించిన అసాధారణ వ్యత్యాసాలు, వంటి డేటా లోపాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. సంబంధిత ఓటర్లు సరైన ఆధారాలను సమర్పించి తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు.గ్రామసభల ముఖ్య ఉద్దేశం తొలగించబోయే ఓట్ల వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేసి, వారికి అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం కల్పించడం, తద్వారా ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమేనని స్పష్టం చేశారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని, తమ పేరు లేదా కుటుంబ సభ్యుల పేర్లకు సంబంధించి ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే వెంటనే సంబంధిత బిఎల్ఓను సంప్రదించాలని కోరారు. నోటీసులు అందుకున్న వారు నిర్ణీత గడువులోగా స్పందించి అవసరమైన ఆధారాలను సమర్పించాలని సూచించారు.బిఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసుల పంపిణీ, ఆధారాల స్వీకరణ, వివరాల పరిశీలన తదితర ప్రక్రియలను నిబంధనల ప్రకారం చేపట్టాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు అధికారులకు సహకరించి, తమ ఓటు హక్కు వివరాలను సక్రమంగా నిర్ధారించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమం లో తహసీల్దార్ నాగార్జున, ఎంపిడివో, బి ఎల్ వో లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రోస్టర్ లోపాలతో మాలలకు తీవ్ర అన్యాయం

**- ఆగస్టు 31న చలో సెక్రటేరియట్ ముట్టడిని విజయవంతం చేయాలి**

**- జై తెలంగాణ మాల మహానాడు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు దళిత రత్న నల్లల కనకరాజు**




పెద్దపల్లి,ఆగస్టు27:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

విద్యా,ఉద్యోగ అవకాశాలలో జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని,రోస్టర్ విధానాన్ని సమీక్షించి వెంటనే సవరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 31న తలపెట్టిన చలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జై తెలంగాణ మాల మహానాడు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు దళితరత్న నల్లల కనకరాజు పిలుపునిచ్చారు.గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చలో సెక్రటేరియట్ ముట్టడికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నల్లల కనకరాజు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ప్రధాన ఉద్దేశం అణగారిన వర్గాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడమేనని గుర్తుచేశారు.ప్రస్తుత రోస్టర్ విధానం కారణంగా మాలలకు రావాల్సిన అవకాశాలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.రోస్టర్‌లో 22వ స్థానం మహిళలకు,46వ స్థానం పురుషులకు కేటాయించడం వల్ల ప్రతి ఉద్యోగ నియామకంలో మాలలకు అన్యాయం జరుగుతోందని,ఒక తరం విద్యార్థులు, నిరుద్యోగులు అవకాశాలు కోల్పోయేలా ఈ విధానం ఉండకూడదని స్పష్టం చేశారు.గత 30 ఏళ్లుగా వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు చేస్తున్నామని, రాష్ట్రంలోని మంత్రులు,ఎమ్మెల్యేలకు అనేకసార్లు వినతిపత్రాలు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు.మాల విద్యార్థులు ఎంతో కష్టపడి చదువుకున్న ప్పటికీ,నియామకాల సమయంలో రోస్టర్ లోపాల వల్ల వారి కష్టం వృథా అవుతోందని వాపోయారు.అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ,ప్రస్తుత రోస్టర్ విధానం వల్ల మాల ఉద్యోగులు, విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు. మాలలకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని అరికట్టి,విద్య,ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేలా రోస్టర్ విధానాన్ని సవరించాలని నాయకులు డిమాండ్ చేశారు.

ఆగస్టు 31లోపు ప్రభుత్వం ఈ సమస్యపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో కరీంనగర్ నగర అధ్యక్షులు మద్దెల రాజేందర్,మానకొండూరు నియోజకవర్గం ఇంచార్జ్ లింగం కుమార్,రాష్ట్ర నాయకులు గూళ్ళ రాజు,కోదాటి రాజకొమురయ్య, కుంచం మల్లయ్య,కట్టెకొల మధు,మట్ట రాజయ్య,కాసర్ల సాంబశివ రావు, పెద్దపెల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ గొర్రె జితేందర్ జిల్లా నాయకులు ఎర్ర రాజయ్య మద్దెల శ్రీను,బండ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## మెట్పల్లి తహశీల్దార్ నీతా సస్పెన్షన్

### భూ భారతి రీ-సర్వే, ప్రత్యేక ఓటరు సవరణలో నిర్లక్ష్యం

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజా కలం) భూ భారతి రీ-సర్వే, ప్రత్యేక



ఓటరు సవరణ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మెట్ పల్లి తహశీల్దార్ నీతాపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేసినట్లు ఆర్డీవో నరసింహారావు తెలిపారు. సంబంధిత పనుల పురోగతి లో నిర్లక్ష్యాన్ని గుర్తించిన కలెక్టర్ ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. భూ భారతి రీ-సర్వే, ప్రత్యేక ఓటరు సవరణ పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయడంలో అలసత్వం ప్రదర్శించిన నేపథ్యంలో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.తహశీల్దార్ నీతా స్థానంలో ముక్తార్ పాషాను మెట్ పల్లి తహశీల్దార్‌గా నియమించినట్లు ఆర్డీవో నరసింహారావు వెల్లడించారు.

## వార్డు 25లో ఆరోగ్య లక్ష్మి కమిటీ ఎంపిక

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజాకలం)

జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులో గల అంగన్వాడీ కేంద్రంలో వార్డు కౌన్సిలర్ సామల జమున రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆరోగ్య లక్ష్మి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో జయప్రద, ఏసీడీపీవో రాజశ్రీ హాజరయ్యారు. ఆరోగ్య లక్ష్మి కమిటీలో మొత్తం 11 మంది సభ్యులు ఉ



ండగా, చైర్మన్‌గా వార్డు కౌన్సిలర్ సామల జమున, అంగన్వాడీ టీచర్ కన్వీనర్‌గా, మరో తొమ్మిది మంది సభ్యులుగా ఉండేలా కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు బాధ్యతలను వివరించారు. ప్రతి నెల 1వ తేదీన అంగన్వాడీ కేంద్రంలో తల్లుల సమావేశం నిర్వహించి ఐసీడీఎస్ కార్యక్రమాలపై వార్డు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాలకు పంపించేలా తల్లిదండ్రులను చైతన్యపరచడంతో పాటు పిల్లల బరువు, ఎత్తు కొలతల్లో సహకరించాలని తెలిపారు. అలాగే గర్భిణులు, బాలింతలు ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రానికి వచ్చి భోజనం చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వరూపరాణి, వార్డు పెద్దలు సామల రాజశేఖర్, ఏఎన్ఎం జ్యోతి, ఆశా వర్కర్ పావని, ఆర్‌పీ సంధ్యారాణితో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన చల్మెడ



రుద్రంగి, ,ఆగష్టు 27,(ప్రజాకలం ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మహ్మద్ సదుల్లా, హసీనా, రీమ్స, హసీనా గత నాలుగు రోజుల క్రితం కారు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాలను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. ఒకే ప్రమాదంలో నలుగురు మృతి చెందడం చాలా బాధాకరమని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారు అన్నారు. అలాగే గల్ఫ్ లో గడ్డం మోహన్ గుండె పోటు తో మరణించగా మృతుని కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడుతూ.. మోహన్ ది నిరుపేద కుటుంబమని, వీసా గడువు ముగియడంతో అక్కడి ప్రభుత్వం ప్రయాణ నిషేధం విధించిందని, డబ్బులు చెల్లిస్తే గాని మృతదేహన్ని ఇండియాకు పంపించరని కనుక ప్రభుత్వం, స్థానిక ఎంఎల్ఏ స్పందించి మృతదేహాన్ని ఇండియాకు తెప్పించే విదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మాజీ మంత్రి కేటీఆర్ తో మాట్లాడి మోహన్ మృతదేహాన్ని తెప్పించే విదంగా నా వంతు ప్రయత్నం చేస్తానని భాదిత కుటుంబానికి హామీ ఇచ్చారు. ఆయన వెంట గంగం మహేష్, మంచె రాజేశం, కంటే రెడ్డి, దయ్యాల కమలాకర్, దయ్యాల నారాయణ, ఉప్పులుటి గణేష్, గసింకటి కొండయ్య, నాగులపల్లి రవీందర్, కదాస్ లక్ష్మణ్, తర్రే గంగారెడ్డి, కోడిగంటి శ్యామ్, గెంటే ప్రశాంత్, తర్రే గంగారెడ్డి, ఏనుగు రాజు, రాగుట్ల నరేష్, గాజే నరేష్, రాములు, మణిదీప్, అలాగే వేములవాడ రూరల్ మండలం నాయకులు ఉన్నారు.

## పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి

### - కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 27 (ప్రజా కలం):విద్యాశాఖ అధికారులు పాఠశాలలను



తరచూ సందర్శించి విద్యార్థుల అభ్యసన స్థాయి, హాజరు, ఎఫ్ఎల్ఎన్, నమోదు తదితర అంశాలను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. గురువారం వెబ్‌ఎక్స్ ద్వారా ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో విద్యాశాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు.జిల్లాలో సుమారు 6 వేల మంది విద్యార్థులను ఇంకా పాఠశాలల్లో చేర్పించాల్సి ఉందని, నమోదు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బేస్‌లైన్ అసెస్‌మెంట్‌లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి రెమిడియల్, అదనపు తరగతులు నిర్వహించాలని తెలిపారు.

ఉపాధ్యాయుల పనితీరు రాబోయే రోజుల్లో గణనీయంగా మెరుగుపడాలని, లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

విద్యార్థులందరికీ పూర్తయిన యూనిఫాంలను ఆగస్టు 31లోగా అందించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఈవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కలం
శుక్రవారం, ఆగస్టు 28, 2026

## నర్సుల కొరతతో సక్రమంగా అందని వైద్యం

ఆసుపత్రి భవనం ఎంత ఆధునికంగా ఉన్నా, అందులో సేవలందించే నైపుణ్యం కలిగిన మానవ వనరులు లేకపోతే ఆరోగ్య మౌలిక వసతుల ప్రయోజనం పూర్తిస్థాయిలో ప్రజలకు చేరదు. తెలంగాణలో వైద్య కళాశాలలు, ఆసుపత్రులు, పడకల సంఖ్య, ఆధునిక వైద్య పరికరాలు పెరుగుతున్న నేపథ్యంలో నర్సింగ్ మానవ వనరుల ప్రణాళికపై కూడా అదే స్థాయిలో దృష్టి పెట్టాల్సిన అవసరం కనిపిస్తోంది. నర్సింగ్ సిబ్బంది వైద్య వ్యవస్థలో సహాయక బలం మాత్రమే కాదు. రోగి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, మందులు సమయానికి అందించడం, వైటల్ పారామీటర్లను నమోదు చేయడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించడం, శస్త్రచికిత్సకు ముందు--తరువాత సంరక్షణ అందించడం వంటి కీలక బాధ్యతలు వారివే. ఐసీయూ, అత్యవసర విభాగాలు, ప్రసూతి, శిశు వైద్యం, వృద్ధుల సంరక్షణ వంటి విభాగాల్లో నర్సింగ్ సేవల ప్రాధాన్యం మరింత ఎక్కువ. రాష్ట్రంలో నర్సింగ్ సిబ్బంది అవసరాన్ని ప్రభుత్వ నియామక చర్యలు కూడా ప్రతిబింబిస్తున్నాయి. 2022లో ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలో వివిధ విభాగాల్లో 10,028 ప్రత్యక్ష నియామక ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తరువాత వీనూ=దీ నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్) పోస్టుల కోసం 2024లో ప్రత్యేక నియామక నోటిఫికేషన్ జారీ చేసింది. అంటే ఆరోగ్య వ్యవస్థ విస్తరణకు అనుగుణంగా నర్సింగ్ సిబ్బందిని నిరంతరం సమకూర్చుకోవాల్సిన అవసరం స్పష్టమవుతోంది. అయితే నియామక ప్రక్రియను కేవలం ఖాళీల భర్తీగా చూడకూడదు. తెలంగాణ హైకోర్టులో నమోదైన ఒక కేసులో 2021 నాటి ప్రభుత్వ వివరాల ప్రకారం 3,311 స్టాఫ్ నర్స్ పోస్టుల్లో 2,418 భర్తీ కాగా, 893 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆ ఖాళీలలో కొన్నింటిని నిర్దిష్ట వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో భర్తీ చేయలేదని ప్రభుత్వ వాదనను కోర్టు రికార్డు చేసింది. ఇది ప్రస్తుత పరిస్థితికి నేరుగా వర్తించే గణాంకం కాకపోయినా, నియామకంతోపాటు అర్హత కలిగిన మానవ వనరుల నిరంతర లభ్యత కూడా ముఖ్యమేనని సూచిస్తుంది. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఉంది. నర్సుల అవసరాన్ని ఒకే సంఖ్య లేదా ఒకే నిష్పత్తితో నిర్ణయించడం సరైంది కాదు. సాధారణ వార్డు, ఐసీయూ, అత్యవసర విభాగం, ప్రసూతి, శిశు విభాగాల్లో రోగుల సంరక్షణ అవసరాలు భిన్నంగా ఉంటాయి. అందువల్ల రోగుల సంఖ్యతోపాటు వారి ఆరోగ్య తీవ్రత, విభాగ స్వభావం, ఆసుపత్రి స్థాయి, 24 గంటల సేవల అవసరం వంటి అంశాల ఆధారంగా సిబ్బంది అవసరాన్ని అంచనా వేయాలి. ప్రపంచ పరిస్థితి కూడా నర్సింగ్ మానవ వనరుల ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) 2025లో విడుదల చేసిన 'ప్రపంచ నర్సింగ్ పరిస్థితి నివేదిక' ప్రకారం, 2023 నాటికి ప్రపంచవ్యాప్తంగా నర్సుల సంఖ్య 2.98 కోట్లకు చేరింది. 2018లో ఉన్న 2.79 కోట్లతో పోలిస్తే ఇది పెరుగుదలే అయినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా నర్సుల పంపిణీలో తీవ్ర అసమానతలు కొనసాగుతున్నాయని నివేదిక పేర్కొంది.. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా నర్సింగ్ కొరత 58 లక్షలుగా అంచనా వేయబడింది. నర్సుల లభ్యత దేశాలు ప్రాంతాల మధ్య తీవ్రంగా అసమానంగా ఉందని నివేదిక పేర్కొంది. తెలంగాణకు ఇది ఒక ముందస్తు హెచ్చరికగా చూడాలి. వృద్ధుల సంఖ్య పెరగడం, దీర్ఘకాలిక వ్యాధులు అధికమవడం, అత్యవసర వైద్య సేవలకు డిమాండ్ పెరగడం వంటి పరిణామాలతో భవిష్యత్తులో నర్సింగ్ సేవల అవసరం మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే నర్సింగ్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు, క్లినికల్ శిక్షణ, ఐసీయూ-ఎమర్జెన్సీ వంటి ప్రత్యేక విభాగాల్లో నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే సిబ్బందికి వసతి-భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా కొత్త ఆసుపత్రులు, అదనపు పడకలు, కొత్త వైద్య విభాగాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతి ప్రణాళికలో "వీటిని నిర్వహించేందుకు అవసరమైన నర్సింగ్ సిబ్బంది ఎంత?" అనే ప్రశ్నకు ముందుగానే సమాధానం ఉండాలి. ఆరోగ్యరంగంలో భవనాలు కనిపిస్తాయి.. పరికరాలు కనిపిస్తాయి.. కానీ రోగి పడక పక్కన నిలిచే నర్సింగ్ చేయి కనిపించకపోతే ఆ వ్యవస్థ అసంపూర్ణమే. తెలంగాణ ఆరోగ్యరంగ తదుపరి దశలో మౌలిక వసతుల విస్తరణతోపాటు మానవ వనరుల ప్రణాళికకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. ఆరోగ్య వ్యవస్థ బలం ఆసుపత్రుల సంఖ్యలో మాత్రమే కాదు.. అవసరమైన సమయంలో రోగికి అందే నాణ్యమైన సేవలో కొలవాలి.

**- హెచ్.ప్రతాప్**

# జగిత్యాల జిల్లాలో భారీగా అక్రమ మద్యం పట్టివేత

### రూ.6.38 లక్షల విలువైన 70 బాక్సుల ఐబీ మద్యం స్వాధీనం.. - ముగ్గురు అరెస్ట్







మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజాకలం): దాద్రా నగర్ హవేలీ నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న భారీ మద్యం డంప్‌ను మెట్‌పల్లి ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. కథలాపూర్ మండలం తాండ్రియల్ ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించిన తనిఖీల్లో ప్రత్యేకంగా తయారు చేసిన వ్యాన్‌లోని రహస్య అరల్లో దాచిన 70 బాక్సుల ఇంపీరియల్ బ్లూ (ఐబీ) మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి తెలంగాణ మార్కెట్ విలువ సుమారు రూ. 6.38 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కేసులో మహారాష్ట్రలోని భివాండీకి చెందిన ప్రధాన నిందితుడు ప్రవీణ్ సిరిగిరితో పాటు డ్రైవర్ ప్రదీప్ జైస్వాల్, అతడి స్నేహితుడు అజయ్ భగవాన్ లను అరెస్ట్ చేశారు. మద్యం రవాణాకు ఉపయోగించిన వ్యాన్‌తో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో 13 బాక్సుల అక్రమ మద్యం పట్టుబడిన కేసు దర్యాప్తులో లభించిన సమాచారం, సాంకేతిక ఆధారాల మేరకు ఎక్సైజ్ అధికారులు నిఘా పెంచారు. ఈ క్రమంలో ప్రవీణ్ సిరిగిరి దాద్రా నగర్ హవేలీలో రూ. 2.85 లక్షలకు 70 బాక్సుల మద్యాన్ని కొనుగోలు చేసినట్లు గుర్తించారు. వాటిని గంభీర్‌పూర్‌కు తరలించేందుకు ప్రదీప్ జైస్వాల్, అజయ్ భగవాన్‌తో రూ. 65 వేల ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పోలీసులకు అనుమానం రాకుండా వ్యాన్‌లో ప్రత్యేక ర్యాక్‌లు, రహస్య అరలు ఏర్పాటు చేసి మద్యాన్ని దాచినట్లు వెల్లడించారు. వారం రోజులుగా నిందితుల కదలికలపై నిఘా పెట్టిన ఎక్సైజ్ అధికారులు గురువారం తెల్లవారుజామున రూట్‌వాచ్ ఆపరేషన్ చేపట్టారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో అనుమానాస్పదంగా వెళుతున్న వ్యాన్‌ను గుర్తించి తనిఖీ చేయగా అక్రమ మద్యం బయటపడింది. ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన మెట్ పల్లి ఎక్సైజ్ సిఐ వినోద్ రాథోడ్, సిబ్బందిని జగిత్యాల జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి అభినందించారు. సమర్థవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందిని ప్రభుత్వ పురస్కారాలకు సిఫార్సు చేస్తామని తెలిపారు.

అక్రమ మద్యం, మాదకద్రవ్యాల రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు 1800 425 2523 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని ఎక్సైజ్ అధికారులు కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# ప్రజల నడ్డివిరిచే స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలి

### తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో కోరుట్లలో భారీ నిరసన

### పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు విద్యుత్ భారం మోపొద్దు: డాక్టర్ రఘు

### నిర్ణయం ఉపసంహరించుకునే వరకు ప్రజల పక్షాన ఉద్యమం కొనసాగిస్తాం: అజార్







మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి, ఆగస్టు 27(ప్రజా కలం): ప్రజలపై అదనపు విద్యుత్ భారాన్ని మోపే స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ రఘు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు.

ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి సమయంలో విద్యుత్ రంగంలో కొత్త భారాలు మోపితే పేద, మధ్యతరగతి కుటుంబాలపై మరింత ఆర్థిక ఒత్తిడి పడుతుందని అన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని, సామాన్యులపై అదనపు భారం పడే నిర్ణయాలను పునరాలోచించాలని సూచించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకుడు అజార్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారం పడే విధానాలను ప్రభుత్వం అమలు చేయడం మానుకోవాలని అన్నారు. ఇప్పటికే విద్యుత్ బిల్లులు, నిత్యావసరాల ధరలు, ఇతర ఖర్చులతో సామాన్య కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో స్మార్ట్ మీటర్ల పేరుతో మరో భారం మోపడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ప్రజల పక్షాన ఉద్యమాన్ని కొనసాగిస్తామని అజార్ భాయ్ స్పష్టం చేశారు. నిరసన సందర్భంగా నాయకులు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గించే చర్యలు చేపట్టాలని, విద్యుత్ రంగంలో తీసుకునే నిర్ణయాలు సామాన్య వినియోగదారుల ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలని కోరారు.

స్మార్ట్ మీటర్ల అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా నిరసన చేపట్టినట్లు నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు సుఖేందర్ గౌడ్, లింగంపల్లి సంజీవ్, సాయి రెడ్డి, శివారెడ్డి, రాజన్న, నాగరాజు, సోమిడి ప్రశాంత్, కోరుట్ల రాజు, మందుల విజయ్, ఆరిఫ్, మతిన్, ఇర్ఫాన్ ముస్తఫా, ఖాలీద్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును కాపాడుకోవాలి, ప్రతి ఓటును నమోదు చేయాలి

### రుద్రంగి మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ

### ఎన్నికల ఉన్నపుడే రాజకీయాలు - రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





రుద్రంగి, ఆగష్టు 27,(ప్రజాకలం ప్రతినిధి)

ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును ఓటరు జాబితాలో నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్ల సహకారంతో ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గ్రామ సభలో పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను విప్ పంపిణీ చేశారు. అనంతరం విప్ మాట్లాడుతూ.. రుద్రంగి మండల కేంద్రంలో 1,937 అనుమానాస్పద ఓట్లను జాబితాలో చేర్చారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 లక్షల ఓట్లు తొలగించబడ్డాయని పేర్కొంటూ తొలగించిన ఓట్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయిలో సభలు నిర్వహించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం, ప్రభుత్వం ఆధార్‌తో ఓటరు వివరాలను అనుసంధానం చేసుకునే అవకాశం కల్పించినప్పటికీ, కొంతమంది పట్టించుకోకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటును జాబితాలో చేర్చాలని, ఒక్క ఓటు కూడా కోల్పోకుండా చూడటం లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు**

గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని విమర్శించిన ఆది శ్రీనివాస్, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించే ప్రక్రియను చేపట్టిందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్న బియ్యం ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. సంక్షేమం, అభివృద్ధి విషయంలో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

**రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి**

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని ఆది శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేస్తామని, మిగిలిన సమయంలో ప్రజలందరినీ కలుపుకొని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి రూ. 250 కోట్లతో పనులు చేపడుతున్నామని, పట్టణ అభివృద్ధిలో భాగంగా రూ. 1.50 కోట్లతో అంబేద్కర్ చౌక్ నుంచి హనుమాన్ టెంపుల్ మీదుగా ఇందిరా చౌక్ వరకు రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ, వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో పుష్పలత, సర్పంచ్ గండి నారాయణ, ఏఎంసీ చెర్మెన్ చెలుకల తిరుపతి నాయకులు ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్, తర్రె లింగం, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి లో రసాబసా



రుద్రంగి, ఆగస్టు 27,(ప్రజాకలం ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రభుత్వ విప్ హాజరై లబ్దిదారులకు పంపిణి చేయగా కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం ఇస్తుండగా స్మార్ట్ రేషన్ కార్డుపైన ప్రదాన మంత్రి నరేంద్ర మోడి ఫోటో ఎందుకు లేదంటూ బీజేపి మండల అధ్యక్షుడు కర్ణవత్తుల వేణుగోపాల్ రావు ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్ ను నిలదీసారు. దీనికి ఆయన సమాదానమిస్తూ తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యం కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణి చేస్తుంది. బీజేపి పాలిత ప్రాంతాల్లో ఎందుకు సన్న బియ్యం ఇయ్యడం లేదని, తెలంగాణం ప్రభుత్వం కొట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో చెల్లిస్తుందని, మరి తెలంగాణ ముఖ్యమంత్రి ఫోటో ఎక్కడైన పెడుతున్నారా అని అడిగారు. చిన్న చిన్న విషయాలకు రాజకీయాలు చేయోద్దని, అభివృద్ధి లో కలిసివరావలని ఆయన అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఫోటో పెట్టడం లేదని, బీజేపి పాలిత ప్రాంతాల్లో సన్న బియ్యం ఇవ్వడం లేదని స్మార్ట్ రేషన్ కార్డులో ప్రదానమంత్రి ఫోటో పెట్టలేదా అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. కాంగ్రెస్ డౌన్ డౌన్, దోపిడి రాజ్యం, దొంగల రాజ్యం అని బీజేపి నాయకులు నినాదాలు చేయడంతో కాంగ్రెస్ నాయకులు మండిపడుతూ కేంద్ర మంత్రి మండల కేంద్రానికి ఒక్క రూపాయి నిధులు తేలదంటూ వాగ్వాదానికి దిగారు. ఒకరినొకరు తిట్టుకున్నారు. దీంతో బీజేపి, కాంగ్రెస్ నాయకుల మద్య తోపులాట జరగడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరు పార్టీల నాయకులని చెదరగొట్టారు. అనంతరం బీజేపి మండల అధ్యక్షుడు కర్ణవత్తుల వేణుగోపాల్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే గుండాయిజం పెరుగుతుందని ముందే చెప్పాం, నేడు రుజువు అయిందని అన్నారు.

## 4వ బెటాలియన్ లో రక్షాబంధన్ వేడుకలు



వరంగల్/హనుమకొండ ఆగస్టు 27 ప్రజా కలం ప్రతినిధి "నాకు నువ్వు రక్ష,నీకు నేను రక్ష – మనమిద్దరం దేశానికి రక్ష"4వ బెటాలియన్ ఆవరణలో రక్షాబంధన్ వేడుకలు స్ఫూర్తిదాయకంగా జరిగాయి.దేశాన్ని కాపాడే సైనికులకు, శాంతిభద్రతలను రక్షించే పోలీస్ సిబ్బందికి రక్షణ కల్పించాలనే ఉన్నత ఆశయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు."నాకు నువ్వు రక్ష, నీకు నేను రక్ష – మనమిద్దరం దేశానికి రక్ష" అనే నినాదంతో సాగిన ఈ వేడుకలు అందరిలో దేశభక్తిని పెంపొందించాయి.ఈ వినూత్న కార్యక్రమంలో వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీ(బొల్లికుంట)విద్యార్థినులు బెటాలియన్ అధికారులకు, సిబ్బందికి రాఖీలు కట్టి తమ సోదరభావాన్నిచాటుకున్నారు.రాఖీలు కట్టిన విద్యార్థినులకు అధికారులు కృతజ్ఞతలు తెలుపుతూ,సమాజ రక్షణలో తమ వంతు బాధ్యతను ఎల్లప్పుడూ నిర్వర్తిస్తామని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో 4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ జె.రాజేందర్, ఆర్ఐలు విజయ్,కార్తీక్,రవి, వెంకటేశ్వర్లు,సర్వర్,రాజ్ కుమార్, ఆర్ఎస్ఐ లు,అధికారులు మరియు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఛాతీ వ్యాధుల శస్త్రచికిత్సలో 'మినిమల్లీ ఇన్వాసివ్ థొరాసిక్ సర్జరీ'

### ఎంతో అవసరం యశోద వైద్యులు వెల్లడి

హనుమకొండ ఆగస్టు 27 ప్రజా కలం ప్రతినిధి ఊపిరితిత్తులు,అన్నవాహిక,ఛాతీ మధ్య భాగం, డయాఫ్రమ్ మరియు ఛాతీ గోడకు వచ్చే వ్యాధులను గుర్తించి చికిత్స చేయడానికి సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ అత్యాధునిక విధానాలను ఉపయోగిస్తోందనీ, ముఖ్యంగా మినిమల్లీ ఇన్వాసివ్, రోబోట్ సహాయంతో చేసే సర్జరీల ద్వారా మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్,అన్నవాహిక క్యాన్సర్,ఛాతీలో కణితులు వంటి వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందనీ,వ్యాధిని త్వరగా గుర్తించడం వల్ల,పేషెంట్లకు మరింత సురక్షితమైన ఆపరేషన్లను ఆసుపత్రి అందిస్తోందనీ తెలిపారు.దీని ద్వారాఖచ్చితమైన చికిత్స లభించడమే కాకుండా,పేషెంట్లు త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఇంటికి వెళ్లగలుగుతున్నారు.యశోద హాస్పిటల్స్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి మాట్లాడుతూ..థొరాసిక్ సర్జరీ అంటే గుండెను మినహాయించి,ఛాతీలో వచ్చే ఇతర వ్యాధులకు చేసే ప్రత్యేకమైన ఆపరేషన్ అని కొన్నిక్లిష్టమైన సమస్యలకు ఛాతీని పూర్తిగా తెరిచి,ఓపెన్ సర్జరీ తప్పనిసరి అయినప్పటికీ,ఇప్పుడు ఆధునిక పద్ధతులుఅందుబాటులోకి వచ్చాయన్నారు.వీడియో కెమెరా సాయంతో చేసే సర్జరీ, రోబోట్ సహాయంతో చేసే సర్జరీ వంటి పద్ధతుల ద్వారా కేవలం ఒక చిన్న రంధ్రం లేదా కోతతో ఆపరేషన్లు చేస్తున్నారనీ వీటివల్ల పేషెంట్లకు సర్జరీ కోత,నొప్పి చాలా తక్కువగా ఉంటాయనీ ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం కూడా ఉండదనీ పేషెంట్లు చాలా త్వరగా తమ పనులు తాము చేసుకోగలుగుతారన్నారు.డాక్టర్లు కూడా చుట్టుపక్కల ఉండే అవయవాలకు ఎలాంటి హాని కలగకుండా చాలా కచ్చితత్వంతో ఈ ఆపరేషన్ చేయగలుగుతారనీ తెలిపారు.




# రీ సర్వే పనులను పకడ్బందీగా,వేగవంతంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ – బర్థిపూర్ గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రిసర్వే, ఎంజాయ్మెంట్ రీ సర్వే పనుల పరిశీలన





ఇబ్రహీంపట్నం,ఆగస్టు27, (ప్రజా కలం ప్రతినిధి ) ఇబ్రహీంపట్నం మండలం బర్థిపూర్ గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే, ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనుల ను గురువారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రీ సర్వే ప్రక్రియను ప్రణాళికా బద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది, ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది, పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని సూచించారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జగిత్యాల జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ప్రస్తుతం ఎంజాయ్మెంట్ రీసర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు.బర్థిపూర్ గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు.రైతులు, గ్రామస్థుల అడిగిన సందేహాలకు తగిన సలహాలు, సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి నరసింహ రావు, తహసీల్దార్ వర ప్రసాద్, రెవెన్యూ అధికారులు, సర్వేయర్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి

### ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి

### ముసాయిదా గ్రామ సభ లో పాల్గొన్న కలెక్టర్ బి. సత్యప్రసాద్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు27 (ప్రజా కలం ) ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో సర్ ముసాయిదా గ్రామ సభ లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ గ్రామసభల ద్వారా ఓటర్ల జాబితా వివరాలను ప్రజలకు చదివి వినిపించి, పారదర్శకంగా పరిశీలన చేపడుతున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లినమరణించిన ఓటర్ల వివరాలను సంబంధిత ఆధారాలతో నిర్ధారించిన అనంతరం నిబంధనల ప్రకారం జాబితా నుంచి తొలగించే ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ వివరాలపై ప్రజల నుంచి అభ్యంతరాలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. సంబంధిత నోటీసులు వారం రోజుల్లో ఓటర్ల ఇళ్లకు చేరుతాయని, నోటీసులు అందుకున్న వారు అందులో పేర్కొన్న గడువులోగా అవసరమైన ఆధారాలను సంబంధిత బిఎల్ఓ కు సమర్పించాలని సూచించారు.ఆధార్ కార్డు కాకుండా రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, కుల ధృవీకరణ పత్రం తదితర గుర్తింపు పత్రాల్లో నిబంధనలకు అనుగుణంగా ఏదైనా ఒక పత్రాన్ని సమర్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. నోటీసులో పేర్కొన్న తేదీన లేదా అంతకంటే ముందే అవసరమైన పత్రాలను సమర్పిస్తే, పరిశీలన అనంతరం సంబంధిత ఓటరు వివరాలను ఆన్‌లైన్‌లో సరిచేసే చర్యలు చేపడతామని పేర్కొన్నారు.అదేవిధంగా ఓటర్ల డేటాలో గుర్తించిన అసాధారణతలుహొహొఉన్న వారికి కూడా నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పుట్టిన తేదీల్లో తప్పులు, కుటుంబ సభ్యుల మధ్య వయస్సుకు సంబంధించిన అసాధారణ వ్యత్యాసాలు, తెలుగు–ఇంగ్లీష్ అనువాదంలో ఇంటిపేర్లు మారడం వంటి డేటా లోపాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. సంబంధిత ఓటర్లు సరైన ఆధారాలను సమర్పించి తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు.ఓటర్ల జాబితా సవరణలో అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు అనవసరంగా తొలగిపోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అదే సమయంలో మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారి వివరాలను నిబంధనల ప్రకారం తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామసభల ముఖ్య ఉద్దేశం తొలగించబోయే ఓట్ల వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేసి, వారికి అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం కల్పించడం, తద్వారా ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమేనని స్పష్టం చేశారు.ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని, తమ పేరు లేదా కుటుంబ సభ్యుల పేర్లకు సంబంధించి ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే వెంటనే సంబంధిత బిఎల్ఓను సంప్రదించాలని కోరారు. నోటీసులు అందుకున్న వారు నిర్ణీత గడువులోగా స్పందించి అవసరమైన ఆధారాలను సమర్పించాలని సూచించారు. బిఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసుల పంపిణీ, ఆధారాల స్వీకరణ, వివరాల పరిశీలన తదితర ప్రక్రియలను నిబంధనల ప్రకారం చేపట్టాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు అధికారులకు సహకరించి, తమ ఓటు హక్కు వివరాలను సక్రమంగా నిర్ధారించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమం లో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు, తహసీల్దార్ వర ప్రసాద్, ఎంపిడివో, బి ఎల్ వో లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# వైరా మున్సిపాలిటీ లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ – రోడ్లు, విద్యుత్ దీపాలు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, పౌర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలి

### పన్నుల వసూళ్లు 100%శాతం పూర్తి చేయాలి – పురపాలకం లో స్వంత ఆదాయం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### వైరా పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, పురపాలక ఆర్థిక స్థితిగతులపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం/ వైరా, ఆగస్టు 27(ప్రజా కలం న్యూస్ ) వైరా మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, రోడ్లు, విద్యుత్, త్రాగునీరు, పౌర సేవల మెరుగుదలకు ప్రత్యేక చొరవ చూపాలని, పట్టణంలో ప్రజలకు మౌళిక వసతులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, వైరా పురపాలక కార్యాలయంలో పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, పురపాలక ఆర్థిక స్థితిగతులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. వైరా మున్సిపాలిటీ కి మంజూరు చేసిన అభివృద్ధి పనులు, పురోగతి, డంపింగ్ యార్డ్, రోజు వారి తడి, పొడి చెత్త సేకరణ, పన్నుల వసూళ్ల వివరాలు, జరుగుతున్న అభివృద్ధి పనులు, ఆర్థిక సంఘం నిధులు, డిఎంఎఫ్టీ నిధులు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా చేపట్టిన పనుల వివరాలు, వాటి స్థితిగతులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, వైరా పురపాలకంలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. పట్టణంలో నూతనంగా చేపడుతున్న సిసి రోడ్లు, బీటీ రోడ్లు, స్టోర్మ్ వాటర్ డ్రైయిన్స్ సంపూర్ణ వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో ప్రాధాన్యత క్రమంలో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. చిన్న మున్సిపాలిటీలకు ప్రారంభ దశలో కొన్ని సమస్యలు సహజంగానే ఉంటాయని, ముఖ్యంగా డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. మున్సిపాలిటీ స్థిరమైన అభివృద్ధి దిశగా పయనించేందుకు కొంత సమయం పడుతుందని, సొంత ఆదాయం కోసం ఇంటి పన్నులు, బకాయి పన్నులను లక్ష్యం మేరకు 100% శాతం పూర్తి స్థాయిలో వసూలు చేయాలన్నారు. రానున్న సంవత్సరాల్లో ప్రణాళికాబద్ధంగా నిధులు సమకూర్చుకుని పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో కనీసం రూ.150 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించు కోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ఎక్కువ మొత్తంలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉన్నప్పటికీ, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యతనిస్తూ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని అన్నారు. ప్రజలకు స్పష్టంగా కనిపించే అభివృద్ధి పనులను చేపట్టడం ద్వారా పట్టణ రూపురేఖలు మారడంతో పాటు, ప్రజల్లో మున్సిపాలిటీ పై విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులతో పోలిస్తే మున్సిపాలిటీ పరిధిలో చేపట్టే పనులు ప్రజలకు త్వరగా కనిపిస్తాయని, పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వైరా పట్టణంలో వాణిజ్య కార్యకలాపాలకు మంచి అవకాశాలు ఉన్నందున, షాపింగ్ కాంప్లెక్స్‌లు, వాణిజ్య సముదాయాలు తదితర ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వాణిజ్య ఆస్తులను సక్రమంగా నిర్వహిస్తూ, వాటికి తగిన అద్దె రేట్లను నిర్ణయించి, క్రమం తప్పకుండా అద్దెలు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్సిపాలిటీకి సొంత ఆదాయ వనరులు పెంచుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆ ఆదాయాన్ని తిరిగి పట్టణ అభివృద్ధికి వినియోగించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ ఆదాయం పెరిగితే ప్రజలకు మరిన్ని మౌళిక వసతులు, పౌర సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి వాటికి ప్రాధాన్యత ఇవ్వడం, మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించడం, చేపట్టిన పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా వైరా మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. వైరా పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను ప్రణాళిక ప్రకారం మెరుగుపర్చాలని అన్నారు. ప్రతి రోజూ ఉదయం వార్డ్ అధికారులు, శానిటేషన్ సూపర్ వైజర్ లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాలని, ప్రతి రోజూ రోడ్లను పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలని, డ్రైనేజీలను క్లీన్ చేయాలని, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం వైరా రిజర్వాయర్ ఆనకట్ట సమీపంలోని డంపింగ్ యార్డ్ స్థలాన్ని, నిరుపయోగంగా ఉన్న మత్స్యశాఖ భవనాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు.

ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, వైరా మున్సిపల్ కమీషనర్ రామచంద్ర రావు, తహసీల్దారు సురేష్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి: తహసీల్దార్ ఝాన్సీ రాణి

గద్వాల ప్రతినిధి ఆగస్టు 27 ప్రజా కలం అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఝాన్సీ రాణి సూచించారు. మల్దకల్ గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ గ్రామసభ నిర్వహించారు.



ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ ఝాన్సీ రాణి మాట్లాడుతూ.. ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా కోల్పోకుండా ప్రతి ఒక్కరూ తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ చిట్టెమ్మ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములై ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కరీం, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ ఆగస్టు 27 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

కేజీబీవీలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భైంసా కేజీబీవీను (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, సిబ్బంది సంఖ్య, హాజరైన వారి సంఖ్య, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రతిరోజు అందిస్తున్న భోజనం, విద్య, తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, మెరుగైన వసతులను, మెనూ ప్రకారం ఆహారాన్ని తప్పనిసరిగా అందించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా, కల్పిస్తున్న సౌకర్యాలు, ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో అని వాకబు చేశారు. పదవ తరగతి విద్యార్థులతో ఇప్పటివరకు పూర్తయిన సిలబస్ నుండి గణితం, భౌతిక శాస్త్రం తదితర సబ్జెక్టుల్లో పలు పాఠాలను విద్యార్థులకు చెప్పి, ప్రశ్నలను వేసి వారి నుంచి జవాబులు రాబట్టారు. జవాబులు చెప్పిన విద్యార్థులను అభినంచి, పెన్నులు బహుమతులుగా ఇచ్చారు. కష్టపడి చదువుకోవాలని తెలిపారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎంపీడీవో నీరజ్ కుమార్, ఎంఈవో సుభాష్, ఎంపీఓ ప్రదీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి 22 ఎ ఎక్స్ టెంట్ లో తేడాలు వస్తే వాటిని భూభారతి పోర్టల్ లోనే పరిష్కరించాలి

### - రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్



నిర్మల్ ఆగస్టు 27 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) రాష్ట్రంలోని భూభారతి, 22-ఏ, సమగ్ర రిసర్వే చేసేందుకు నిర్దేశించిన అంశాల పై గురువారం రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ మాట్లాడుతూ, భూభారతి డాటా ఆధారంగా ఎక్కడైనా 22 ఎ ఎక్స్ టెంట్ లో తేడాలు వస్తే వాటిని భూభారతి పోర్టల్ లోనే పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22 ఎ కింద నమోదు అయినట్లు ఉంటే వాటిని గుర్తించి, నిర్ణీత ప్రొఫార్మాలో తహసిల్దార్ ల నుంచి సేకరించి నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం అమలు చేయాలని తెలియజేశారు. ఎస్ ఆర్ ఓ లో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో సమగ్రంగా భూ రీసర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వాటి సత్ఫలితాలు ఆధారంగా అన్ని గ్రామాల్లో రీ-సర్వే చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఈ వీసీలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శీను బాబు సమక్షంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి జన్మదిన వేడుకలు

కమాన్ పూర్ : కమాన్ పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ జన్మదిన వేడుకలు పిసిసి ప్రధాన కార్యదర్శి శీను బాబు సమక్షంలో బుధవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని శ్రీ ఆదివారా స్వామి ప్రాంగణంలో సయ్యద్ ఇక్బాల్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శీను బాబు సమక్షంలో కేక్ కట్ చేసి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ సయ్యద్ అన్వర్, సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, అంబిలి శ్రీనివాస్, రెబల్ రాజ్ కుమార్, కిషన్ రెడ్డి, ఉప సర్పంచ్ సోహెల్, జెమినీ గౌడ్, మల్యాల మహేష్ గౌడ్, లల్లు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రాణాపాయ స్థితిలో ఉన్న గర్భిణికి పునర్జన్మనిచ్చిన మెడికవర్ వైద్యులు



వరంగల్/హనుమకొండ ఆగస్టు 27 ప్రజా కలం ప్రతినిధి

ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరిన 32 ఏళ్ల మహిళకు వరంగల్ మెడికవర్ వైద్యులు సకాలంలో చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. రప్చర్డ్ ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ (గర్భాశయం వెలుపల ఏర్పడిన గర్భం పగిలిపోవడం) కారణంగా తీవ్ర అంతర్గత రక్తస్రావానికి గురైన రోగిని అత్యవసర శస్త్రచికిత్స ద్వారా కాపాడడమే కాకుండా, శస్త్రచికిత్స అనంతరం గుండె ఆగిపోయిన పరిస్థితిలోనూ తిరిగి ప్రాణం పోసి విజయవంతంగా కోలుకునేలా చేశారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తీవ్రమైన కడుపు నొప్పి వంటి లక్షణాలతో బాధపడుతున్న 32 ఏళ్ల మహిళ మెడికవర్ హాస్పిటల్‌లో చేరారు. ప్రారంభం దశలో లక్షణాలను పరిశీలించిన కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డా. శ్రవణ్ కుమార్ పర్యవేక్షణలో చికిత్స ప్రారంభించి, రోగి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఆమెను క్రిటికల్ కేర్ విభాగానికి తరలించారు. డా. దీపక్ క్రిటికల్ కేర్ బృందం అవసరమైన పరీక్షలు, వైద్య మూల్యాంకనాలు నిర్వహించగా సమస్య గైనకాలజీకి సంబంధించినదిగా గుర్తించారు. తదుపరి పరీక్షల్లో రోగికి రప్చర్డ్ ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీతో పాటు భారీ హీమోపెరిటోనియం(కడుపులో రక్తం పేరుకుపోవడం)ఉన్నట్లు నిర్ధారణ అయింది. సుమారు 3.5 లీటర్ల రక్తం అంతర్గతంగా పేరుకుపోవడంతో ఆమె పరిస్థితి అత్యంత విషమంగా మారిందనీ ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డా. అమిత ఆధ్వర్యంలో అత్యవసరంగా లాపరోస్కోపిక్ శస్త్రచికిత్స నిర్వహించి పగిలిపోయిన ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీని తొలగించారు. శస్త్రచికిత్స సమయంలో రోగికి భారీ స్థాయిలో రక్త మార్పిడి అవసరమై, మొత్తం 8 యూనిట్ల రక్త భాగాలను అందించారు. శస్త్రచికిత్స పూర్తయిన అనంతరం ఇంకా ఆపరేషన్ థియేటర్‌లోనే ఉన్న సమయంలో రోగికి అకస్మాత్తుగా కార్డియాక్ అరెస్ట్ (గుండె ఆగిపోవడం) సంభవించింది. వెంటనే డా. వాసు బృందం అత్యవసరంగా సీపీఆర్ మరియు పునరుజ్జీవన చికిత్సలు ప్రారంభించి, రోగిని విజయవంతంగా తిరిగి ప్రాణాలతో నిలబెట్టారు. ఆ తర్వాత రోగిని ఒక రోజు పాటు వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉంచి అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షించారు. అనంతరం ఆమె పూర్తిగా కోలుకుని ఎటువంటి ఇతర సమస్యలు లేకుండా ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారు. ఈ కేసు క్లిష్ట వైద్య పరిస్థితుల్లో సకాలంలో నిర్ధారణ, మల్టీడిసిప్లినరీ వైద్య బృందాల సమన్వయం మరియు అత్యవసర చికిత్స ఎంత కీలకమో మరోసారి నిరూపించింది. ఈ విజయవంతమైన చికిత్సలో కార్డియాలజీ, క్రిటికల్ కేర్, గైనకాలజీ, అనస్థీషియా మరియు ఆపరేషన్ థియేటర్ బృందాల సమిష్టి కృషి కీలక పాత్ర పోషించింది. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ నమ్రత, డీఎంఎస్ డా. అనిత, మార్కెటింగ్ హెడ్ హరినాథ్ పాల్గొన్నారు.

## గురుకుల విద్యాలయానికి ఫ్యాన్ బహూకరణ

### విద్యార్థుల శ్రేయస్సే ప్రథమ కర్తవ్యం.. సేవా కార్యక్రమాలతో దంపతుల వివాహ వార్షికోత్సవం

ఆగస్టు 27, ప్రజాకలం ప్రతినిధి: వరంగల్/వర్ధన్నపేట: వివాహ వార్షికోత్సవాన్ని వేడుకలకు మాత్రమే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమానికి వేదికగా మార్చుకున్నారు వర్ధన్నపేట పట్టణానికి చెందిన ప్రజాకలం వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఎంజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసునూరి మురళి--అరుణ దంపతులు. తమ రెండు దశాబ్దాల వైవాహిక జీవితాన్ని పురస్కరించుకుని జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల-కళాశాల డార్మిటరీకి ఫ్యాన్‌ను బహూకరించారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించాలన్న ఉద్దేశంతో ఈ సహాయ కార్యక్రమాన్ని చేపట్టారు. తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గత 20 ఏళ్లుగా వృద్ధులు, అనాథ పిల్లలు, రోగులు తదితరులకు తమకు తోచిన రీతిలో సహాయం చేయడం ద్వారా ఆత్మసంతృప్తి పొందుతున్నామని పసునూరి మురళి తెలిపారు.



**సేవలోనే నిజమైన సంతృప్తి**

సమాజంలో అవసరంలో ఉన్న వారికి చేయూత అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆడంబరాలకు దూరంగా, తమ సంతోషాన్ని ఇతరుల అవసరాలకు ఉపయోగపడేలా మలచుకోవడమే తమ కుటుంబం అనుసరిస్తున్న విధానమన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అందించే చిన్నపాటి సహాయం కూడా వారి చదువు, ఆరోగ్యం, భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతుందని తెలిపారు. దేవుడు చల్లగా దీవిస్తే రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలు, అనాథలు, వృద్ధులు, విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తానని మురళి తెలిపారు. వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ద్వారా తమ ఆనందాన్ని మరింత రెట్టింపు చేసుకున్నామని ఆయన అన్నారు.

**విద్యార్థుల అవసరాలకు అండగా నిలవాలి**

గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల అవసరాలను గుర్తించి దాతలు, స్వచ్ఛంద సంస్థలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ముందుకు రావాలని పలువురు కోరారు. విద్యార్థుల సౌకర్యాల కోసం అందించే ప్రతి సహాయం వారి విద్యాభ్యాసానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. మురళి--అరుణ దంపతుల సేవాభావాన్ని పలువురు అభినందించారు.

## చెట్లే మానవాళికి జీవనాధారం

### వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పాలేరు ఆగస్టు 27(ప్రజా కలం న్యూస్ )

మానవాళి మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు చెట్లే ప్రధాన జీవనాధారమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామంలో నిర్వహించిన 'వనమహోత్సవం' కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మంత్రి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్న ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత ఎల్నినో పరిస్థితికి వాతావరణ సమతుల్యత దెబ్బతినడమే కారణమన్నారు. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే మనం ఇచ్చే నిజమైన కానుక అని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను చెట్టుగా మారే వరకు పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు దత్తత తీసుకున్నట్లు సంరక్షించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ పచ్చదనం పెంపొందించడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

ఈ కార్యక్రమంలో పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, తిరుమలాయపాలెం మండల ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహశీల్దార్ విల్సన్, ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ నల్లమల్ల కీర్తి నీరన్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొనరు.

## పాఠశాలల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంచాలి

### - అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 27:




పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆంగ్ల విద్యను అందిస్తూ, వారిలో భాషా నైపుణ్యాలను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి 'వెబెక్స్' ద్వారా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో ఆంగ్ల భాష బోధన మరియు అభ్యసన ప్రక్రియలపై ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. తరగతి గదుల్లో విద్యార్థుల స్థాయికి అనుగుణంగా నూతన బోధనా పద్ధతులను అవలంబించాలని సూచించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, అర్థం చేసుకోవడంతో పాటు ఆంగ్లంలో ధారాళంగా మాట్లాడే సంభాషణా సామర్థ్యాన్ని పెంపొందించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులు భయం లేకుండా ఆంగ్లంలో మాట్లాడే వాతావరణాన్ని కల్పించాలని, వారి అభ్యసన ఫలితాలను నిరంతరం పరిశీలిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులు పరస్పరం ఉత్తమ బోధనా పద్ధతులను పంచుకుంటూ, విద్యార్థులను బోధనా ప్రక్రియలో చురుగ్గా భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. ఈ వెబెక్స్ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, మండల విద్యాశాఖ అధికారులు, ప్రాంతీయ సమన్వయ అధికారులు, సమగ్ర శిక్షా అభియాన్‌కోఆర్డినేటర్లతో పాటు వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో పౌరులు భాగస్వాములు కావాలి

### సి.ఈ. ఓ కార్యాలయ అధికారిణి పద్మజా రాణి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 27:

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 ప్రక్రియను పక్కాగా నిర్వహించేందుకు ఓటర్లందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారిణి శ్రీమతి జి. పద్మజా రాణి పిలుపునిచ్చారు. జిల్లాలో నిర్వహిస్తున్న గ్రామ/వార్డు సభల పర్యవేక్షణ నిమిత్తం విచ్చేసిన ఆమెకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) 75-జడ్చర్ల నియోజకవర్గ ఈఆర్ఓ హరిప్రియ స్వాగతం పలికారు. అనంతరం రాజాపూర్ మండల కేంద్రంలో తహసీల్దార్/ఏఈఆర్ఓ అధ్యక్షతన పోలింగ్ స్టేషన్లు 111, 112, 113, 114 పరిధిలో ప్రజాప్రతినిధులు, ఓటర్ల సమక్షంలో నిర్వహించిన గ్రామసభకు అదనపు కలెక్టర్ తో కలిసి పద్మజా రాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మజా రాణి మాట్లాడుతూ... ప్రత్యేక సమగ్ర సవరణ-2026 ప్రక్రియకు సంబంధించిన పలు కీలక అంశాలను ఓటర్లకు స్పష్టంగా వివరించారు. ఓటర్లందరూ తమ ఓటు వివరాలను స్వయంగా పరిశీలించుకోవాలని, సమాచారంలో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని ఓటరు జాబితాలో తమ వివరాలు సక్రమంగా ఉండేలా నిర్ధారించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజాపూర్ మండల తహసీల్దార్/ఏఈఆర్ఓ, రాధాకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జడ్చర్ల నియోజకవర్గంలో నూతన ఓటర్ల నమోదుకు దరఖాస్తుల ఆహ్వానం:

### - అదనపు కలెక్టర్ హరిప్రియ

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 27: జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అర్హులైన పౌరులు నూతన ఓటర్ నమోదుతో పాటు సవరణల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అదనపు కలెక్టర్ (రెవెన్యూ, ఈఆర్ఓ హరిప్రియ తెలిపారు. గురువారం జడ్చర్లలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపులు, సవరణలకు సంబంధించి ఫారం-6, ఫారం-7, ఫారం-8 ల ద్వారా దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో మార్పుచేర్పులు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల అవగాహన కార్యక్రమంలో భాగస్వాములై అర్హులందరూ నమోదు చేసుకునేలా సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్/ఏఈఆర్ఓ నర్సింగ రావు, అదనపు తహసీల్దార్, జడ్చర్ల పురపాలక కమిషనర్, జడ్చర్ల డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) మరియు 75-జడ్చర్ల నియోజకవర్గ ఎలక్షన్ డీటీతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మొగిలి మహాలక్ష్మి ఆలయంలో చోరీ

### -రూ.80 వేల నగదు అపహరణ



తానూర్, ఆగస్టు 27(ప్రజా కలం): తానూర్ మండలం మొగిలి గ్రామంలోని ప్రముఖ మహాలక్ష్మి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు, ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు హుండీని పగులగొట్టి అందులోని సుమారు రూ. 80 వేల నగదును అపహరించారు, గురువారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు హుండీ ధ్వంసమై ఉండటాన్ని గుర్తించి గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించారు, విషయం తెలుసుకున్న తానూర్ ఎస్సై జుబేర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు, అనంతరం క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు, ఆలయంలోని పరిసరాలను పరిశీలించి చోరీకి పాల్పడిన దుండగులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై జుబేర్ గ్రామస్థులకు భరోసా ఇచ్చారు.

# విద్యా భారతి పాఠశాలలో ఘనంగా ముందస్తు రక్షాబంధన్



నిర్మల్ ఆగస్టు 27 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కుబీర్ మండలం పల్సి గ్రామంలోని విద్యా భారతి పాఠశాలలో గురువారం రక్షాబంధన్ ఉత్సవాలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పురంశెట్టి లింగయ్య మాట్లాడుతూ.. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా"ఎక్కడైతే స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కూడా ఉంటారని, స్త్రీకి ఇచ్చేటటువంటి గౌరవంతో పాటు, సోదరీ సోదర భావము గురించి ప్రత్యక్షంగా రాఖీ పండగ ద్వారా మనకు తెలుస్తుంది అన్నారు. మన సంప్రదాయంలో ప్రతి శుభకార్యంలో కూడా మనం ధారణ చేసే కంకణం ఒక వ్యక్తి తన లక్ష్యాన్ని చేరుకోవడంలో కంకణ బద్ధులై ఉండడాన్ని సూచిస్తుంది. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు"నేను నీకు రక్ష నీవు నాకు రక్ష మనిద్దరం దేశానికి రక్షా అని అనుకుంటూ రాఖీలు కట్టుకున్నారు. అదేవిధంగా విద్యార్థులకు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతన్న, లక్మ. మధుసూదన్, గౌర. సాయినాథ్, రాజు, దేవకి, సరస్వతి, సరోజన, కవిత, నేహా, పద్మ, గంగ వేణి, శృతిక, లక్ష్మి, గంగామణి, భువనేశ్వరి, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## అన్నాభావూ సాఠే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి: సర్పంచ్ గంగాసాగర



తానూర్, ఆగస్టు 27(ప్రజా కలం): మండలంలోని హిప్నెల్లి గ్రామంలో డాక్టర్ అన్నాభావూ సాఠే 106వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ చంద్రే గంగాసాగర – శివరాం, సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తన సాహిత్యంతో సామాజిక చైతన్యానికి, శ్రామిక వర్గాల హక్కుల కోసం బాటలు వేసిన మహనీయుడు సాఠే అని కొనియాడారు,ఆయన చూపిన బాటలో పయనిస్తూ సామాజిక సమానత్వానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు, ఈ వేడుకల్లో ఉపసర్పంచ్ గంగాధర్, కార్యదర్శి అబ్దుల్ అజీజ్, వార్డు సభ్యులు రాజు, కల్పనా ఉమాకాంత్, లక్ష్మణ్ పటేల్, ఎం.ఆర్.పి.ఎస్ మండల అధ్యక్షుడు సాహెబ్ రావు, నాయకులు శశి రావు, ఆడేల్లు, లక్ష్మణ్, సాయినాథ్, గ్రామ పెద్దలు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

## టీసీసీ మీడియా జిల్లా అధ్యక్షులు ప్రసాద్ ను సన్మానించిన నూతి సత్యనారాయణ గౌడ్..



తల్లాడ ఆగస్టు 27: ప్రజా కలం న్యూస్ తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా మీడియా అధ్యక్షుడిగా ఎన్నికైన నారపోగు ప్రసాద్ ను కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ సన్మానించారు. గురువారం తల్లాడకు వచ్చిన ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రసాద్ ను శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా అధ్యక్షులుగా ప్రసాద్ ఎంపిక కావడం అభినందనీయమని, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా మీడియా ఉండాలని సూచించారు. అనంతరం నూతి సత్యనారాయణ గౌడ్ కు ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలోమండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మీ రెడ్డి , జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాస రావు , ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు, కల్లూరు టౌన్ ఇంచార్జ్ కోసూరు వెంకటేశ్వర్లు (కె.వి), మాజీ జెడ్పిటిసి ఎం. ప్రసాద్,వెంకటరమణారెడ్డి,మండలం ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్,తుమ్మలపల్లి రమేష్ దాసరి శ్రీనివాసరావు ,మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సర్పంచులు ఉపసర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ సమీపంలో గంజాయి కలకలం.. ముగ్గురు అదుపులో

గద్వాల ప్రతినిధి ఆగస్టు 27 ప్రజా కలం:జోగులాంబ గద్వాల: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గంజాయి పట్టుబడిన ఘటన కలకలం రేపింది. ఓ షెడ్డులో



గంజాయి ఉన్నట్లు సమాచారం అందడంతో బుధవారం రాత్రి గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. వారి వద్ద నుంచి కొంతమేర గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పట్టుబడిన వ్యక్తులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారని, కూలీ పనుల నిమిత్తం గద్వాలకు వచ్చినట్లు సమాచారం. అయితే గంజాయి వారికి ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరైనా సరఫరా చేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. వారు గంజాయిని వ్యక్తిగత వినియోగం కోసం తెచ్చుకున్నారా? లేక సరఫరా చేసేందుకు తీసుకొచ్చారా? అనే విషయాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. కాగా, పట్టుబడిన వ్యక్తులను విడిపించేందుకు ఓ జిల్లా నాయకుడు ప్రయత్నిస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై పోలీసుల నుంచి అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది.

# రోడ్డు భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలి

### - రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 27:

ప్రజల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్డు భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ అధ్యక్షతన నెలవారీ రోడ్డు భద్రతా సమావేశం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో అధికారులకు నిర్దేశించిన గడువులు, కార్యాచరణ అంశాలపై సమీక్షించారు. ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను సంబంధిత అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా బాలానగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేసి సెప్టెంబర్ 10 వ తేదీ లోపు పూర్తి చేయాలని అన్నారు. జాతీయ రహదారిపై ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించడంతో పాటు, భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హరిప్రియ సూచించారు. రోడ్డు భద్రతా



నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రహదారుల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. గత సమావేశంలో నిర్దేశించిన కార్యాచరణ అంశాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఏ. శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల సంస్థ, పోలీస్, రవాణా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాంటెక్‌లో ఘనంగా బుద్ధ విగ్రహ ప్రతిష్ఠాపన

నిర్మల్ ఆగస్టు 27(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ముథోల్ మండలం రాంటెక్ గ్రామంలోని విక్రమ్‌శీల బుద్ధ విహార్‌లో గ్రామ బౌద్ధ ఉపాసకుల ఆధ్వర్యంలో బౌద్ధ ధమ్మాచరణతో బుద్ధ మూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ బౌద్ధ బిక్షువు బోధి దమ్మో చేతుల మీదుగా బుద్ధ మూర్తిని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా బౌద్ధ ధమ్మ సంప్రదాయాల ప్రకారం బుద్ధ వందన, ధమ్మాచరణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఆటో స్టాండ్ నుంచి బుద్ధ మూర్తిని వాహనంపై ఉంచి విక్రమ్‌శీల బుద్ధ విహార్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బుద్ధుని ధమ్మ బోధనలు, సమానత్వం, శాంతి, మైత్రీ సందేశాలను చాటుతూ



కార్యక్రమాన్ని కొనసాగించారు. ర్యాలీ సందర్భంగా సమతా సైనిక్ దళ్ సభ్యులు జై భీమ్ నినాదాలతో బంతే బోధి దమ్మోకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా బంతే బోధి దమ్మో చేతుల మీదుగా పంచరంగుల బౌద్ధ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఉపాసకులు, ఉపాసికలకు ధమ్మ సందేశాన్ని అందించారు. ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ కార్యక్రమంలో పాల్గొని బుద్ధ మూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉపాసకులు, ఉపాసికలకు నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ వాగ్మారే, భారతీయ బౌద్ధ మహాసభ సభ్యులు, పరిసర గ్రామాల ఉపాసకులు, ఉపాసికలు, యువత, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన అవసరం

### - రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్ .బి హరిప్రియ.

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 27:

విద్యార్థులను మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వ్యసనం నుంచి కాపాడేందుకు పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, ఇతర విద్యాసంస్థల్లో నిరంతరం విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ సూచించారు. విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం గమనిస్తూ, వారు చెడు సహవాసానికి లోనుకాకుండా పర్యవేక్షించాలని కోరారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా డ్రగ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. డ్రగ్ కంట్రోల్, పోలీస్, విద్య, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. మాదకద్రవ్యాల విషయంలో ప్రధానంగా సరఫరా చేసే వారు, వినియోగించే వారు అనే రెండు వర్గాలు ఉంటాయని హరిప్రియ తెలిపారు. విద్యార్థులు ఎక్కువగా వినియోగదారుల వర్గంలోకి వచ్చే అవకాశం ఉన్నందున వారికి మాదకద్రవ్యాలు చేరకుండా సరఫరా వ్యవస్థను అడ్డుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల ఆనవాళ్లు గుర్తిస్తే అవి ఎక్కడి నుంచి వచ్చాయి, ఎవరి ద్వారా ఎవరికి చేరుతున్నాయో నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. మాదకద్రవ్యాలకు విద్యార్థులు బానిసలైతే వారి విద్య, భవిష్యత్తు, కెరీర్‌తో పాటు జీవితం తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యార్థులతో పాటు బోధన, బోధనేతర సిబ్బందికి కూడా క్రమం తప్పకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. కేసులు వెలుగులోకి వచ్చినప్పుడు మూలాలను గుర్తించి, నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖల మధ్య సమన్వయం, నిరంతర అవగాహన, పర్యవేక్షణ అత్యంత కీలకమని హరిప్రియ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఏ. శ్రీనివాసులు, ఔషధ నియంత్రణ అధికారులు, పోలీస్ అధికారులు, విద్యాసంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

### ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలి

### ఫీజుల బకాయిలను వెంటనే చెల్లించాలి

### రిటైర్డ్ ఎంప్లాయీస్ బెనిఫిట్స్ మొత్తాలను అందజేయాలి: ఎంపీ రవిచంద్ర

ఖమ్మం ఆగష్టు 27(ప్రజా కలం న్యూస్ )

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన 6 డీఏలను పెండింగ్ లో పెట్టడం, పీఆర్సీ ప్రకటించకపోవడం తీవ్ర విచారకరమన్నారు.దేశంలోని ఇతర ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈవిధంగా 6 డీఏలను పెండింగ్ లో పెట్టడం ఇప్పటివరకు జరుగలేదన్నారు.ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం (ఇహెచ్ఎస్)వాళ్ల నెల జీతం నుంచి ఒక్క శాతం (1%) కాంట్రిబ్యూషన్ పథకాన్ని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తీసుకువచ్చారని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో గుర్తు చేశారు.అయితే, దానిని 1.5 శాతానికి పెంచి కూడా సక్రమంగా అమలు చేయకపోవడంతో ఉద్యోగులు,పింఛన్ దారులు, వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.కేసీఆర్ పాలనలో ఉద్యోగులతో స్నేహపూర్వక వాతావరణం ఉండేదని, వారికి తెలంగాణ పేరిట ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వడమే కాక ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా 73శాతం ఫిట్ మెంట్ అందజేసి గౌరవించారని ఎంపీ వద్దిరాజు వివరించారు.సముచిత రీతిలో పీఆర్సీ ఇస్తామని, క్రమం తప్పకుండా డీఏలు చెల్లిస్తామని,సీపీఎస్ రద్దు చేస్తామని,ఇహెచ్ఎస్ ను సక్రమంగా అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన కాంగ్రెస్



నాయకులు..తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం శోచనీయమన్నారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిందిగా, పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు అంధకారం కాకుండా జీవో నంబర్ 97ను ఉపసంహరించాలన్న బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీష్ రావు,మాజీ మంత్రి దయాకర్ రావు, ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి,ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ తదితరులను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికమని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, రిటైర్డ్ ఎంప్లాయీస్ బెనిఫిట్స్ విడుదల చేయాలని,జాబ్ కేలండర్ అమలుపర్చాలని,జీవో 97ను వెనక్కి తీసుకోవాలని,ఫీజుల బకాయిలను చెల్లించాలని ఎంపీ వద్దిరాజు కోరారు.

## కొయ్యూరులో ఇందిరా శ్వసక్తి శక్తి కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

### మంత్రి శ్రీధర్ బాబు కృషితో మహిళలకు స్వయం ఉపాధి

మల్హర్, ఆగస్టు 27 ప్రజాకలం ప్రతినిధి :

తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కృషితో మల్హర్ మండలం కొయ్యూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఇందిరా శక్తి కుట్టు శిక్షణ కేంద్రాన్ని కొయ్యూరు గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు కొండ రాజమ్మ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగిడి శ్రీనివాస్



చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కొండ రాజమ్మ మాట్లాడుతూ, ఐదు గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం దుస్తులు కుట్టే బాధ్యతను స్థానిక మహిళలకు అప్పగించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఇందిరా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడతారని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, వల్లెంకుంట సర్పంచ్ బొమ్మ రమేష్ రెడ్డి, ఉప సర్పంచులు, ఏపీఎం తెప్పల రజిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వదీప్తిలో రాఖీ పండుగ సందడి

### కొయ్యూరు విశ్వదీప్తి పాఠశాలలో ముందస్తు రాఖీ సంబరాలు




మల్హర్, ఆగస్టు 27 ప్రజాకలం ప్రతినిధి రాఖీ పండుగను పురస్కరించుకుని మల్హర్ మండలం కొయ్యూరులోని విశ్వదీప్తి పాఠశాలలో గురువారం ముందస్తుగా రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు.పాఠశాల కరస్పాండెంట్ ఎం.కె. సుదర్శనన్, ప్రిన్సిపాల్ మెర్సీ వర్గీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య రాఖీ పండుగ సంబరాలు జరుపుకున్నారు. రాఖీ పండుగ సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలకు, ఆప్యాయతకు ప్రతీక అని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.

## భూ వివాదంలో ఘర్షణ

### - రైతుపై దాడి, ముగ్గురిపై కేసు

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 27 (ప్రజా కలం): మల్దకల్ మండలం ఉలిగేపల్లి గ్రామంలో భూ వివాదం కారణంగా జరిగిన ఘర్షణలో ఓ రైతుపై దాడి జరిగినట్లు స్థానిక ఎస్ఐ కొండ శ్రీహరి తెలిపారు. ఘటనపై ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



ఎస్ఐ కొండ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. ఉలిగేపల్లి గ్రామానికి చెందిన కురువ నర్సింహులు (38)కు తన బంధువులైన కురువ తిరుమలేష్, కురువ నర్సింహులు, కురువ జయన్నలతో కొంతకాలంగా భూ వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆగస్టు 26న రాత్రి 8 గంటల సమయంలో భూ సమస్యపై మాట్లాడేందుకు నర్సింహులు కురువ జయన్న ఇంటికి వెళ్లాడు.

ఈ సందర్భంగా మాటామాటా పెరగడంతో నిందితులు తనను దూషించి, చంపుతామని బెదిరించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతరం కురువ తిరుమలేష్ కర్రతో తలపై, కురువ నర్సింహులు కర్రతో వీపుపై కొట్టగా, కురువ జయన్న చేతులతో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ దాడిలో గాయపడిన నర్సింహులును అతని భార్య చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించింది.

బాధితుడి ఫిర్యాదు మేరకు ఆగస్టు 27న మధ్యాహ్నం 2:10 గంటలకు మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండ శ్రీహరి తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉందన్నారు.

## గుర్తుతెలియని కారు ఢీ..

### చేనేత కార్మికురాలికి గాయాలు

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 27 (ప్రజా కలం): గద్వాల పట్టణంలోని విష్ణుప్రియ హోటల్ సమీపంలో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.



రోడ్డు పక్కగా వెళ్తున్న చేనేత కార్మికురాలు చంద్రకళను వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని కారు ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు.కారు ఢీకొనడంతో చంద్రకళకు గాయాలు కాగా, వెంటనే స్పందించిన స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు ఆచూకీ తెలియకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సీసీ కెమెరాలపై నజర్.. బాధ్యుడిని గుర్తించాలి**

ప్రమాదం జరిగిన ప్రాంతంతో పాటు సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించి, ప్రమాదానికి కారణమైన కారును గుర్తించాలని చేనేత కార్మికులు, స్థానికులు కోరుతున్నారు. బాధితురాలికి న్యాయం జరిగేలా పోలీసులు తక్షణమే స్పందించి, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎల్కూర్‌లో ఘనంగా ఎస్ఐఆర్ గ్రామసభ




గద్వాల ప్రతినిధి ఆగస్టు 27 ప్రజా కలం: జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఎల్కూర్ గ్రామంలో గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో సర్పంచ్ పి.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజల నుంచి అవసరమైన వివరాలు, సూచనలు స్వీకరించి ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుభావతి, వార్డు నెంబర్స్, ప్రజలు పాల్గొన్నారు.

## రాఖీ బంధంతో కలెక్టర్‌కు ఆత్మీయ పలకరింపు



నాగర్‌కర్నూల్ జిల్లా, ఆగస్టు 27 (ప్రజా కలం ):

గురువారం నాడు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిసి రాఖీలు కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి చదువులు, ఆసక్తులు, భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, సమయపాలన, మంచి నడవడిని అలవర్చుకొని విద్యలో రాణించాలని, తల్లిదండ్రులకుపాఠశాలకు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో రాఖీ పండుగకు ప్రత్యేక స్థానం ఉందని కలెక్టర్ అన్నారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, పరస్పర గౌరవానికి రాఖీ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళల భద్రత, గౌరవం ఎంతో ముఖ్యమనే సందేశాన్ని కూడా రాఖీ పండుగ అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని మహిళలు, సోదర సోదరీమణులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్, ప్రతి కుటుంబంలో సంతోషం, సౌభ్రాతృత్వం, ప్రేమానురాగాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## వెన్నచర్లలో ఘనంగా ఎస్ఐఆర్ గ్రామ సభ

### - 42 నోటీసులపై అధికారులను అభినందనలు

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలన
- భూ సమస్యల పరిష్కారానికి హామీ
- కలెక్టర్ ను సన్మానించిన మాజీ ఎంపీటీసీ సూర్య ప్రతాప్ గౌడ్



నాగర్ కర్నూల్ ఆగస్టు 27 ప్రజా కలం (ప్రతినిధి):

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం వెన్నచర్ల గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ హేమంత్ కేశవ్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దకొత్తపల్లి మండలం మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్,ఆర్డీఓ బన్సీలాల్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ గ్రామంలోని గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం సర్పంచ్ సూర్యనారాయణమ్మ అధ్యక్షతన ఎస్ఐఆర్ గ్రామ సభ నిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి ఆర్డీఓ బన్సీలాల్ మాట్లాడుతూ వెన్నచర్లలోని 1, 2, 3 బూత్‌ల పరిధిలో 42 నోటీసులు జారీ చేయగా, మరణించిన 157 మంది, డబుల్ ఎంట్రీలు 192, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన 328 మంది, గైర్హాజరైన 16 మంది కలిపి మొత్తం 693 మంది ఓటర్ల పేర్లు తొలగించినట్లు తెలిపారు. గ్రామంలో 2,997 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంత పెద్ద గ్రామంలో కేవలం 42 నోటీసులు రావడం అధికారుల సమర్థవంతమైన కృషికి నిదర్శనమని బీఎల్ఓలు, తహసీల్దార్, జీపీఓలు, వీఎల్ఓలను అభినందించారు. నోటీసులు అందుకున్న వారు సరైన ఆధారాలు సమర్పించి ఓటు హక్కును కాపాడుకోవాలని సూచించారు. వెన్నచర్ల గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించి, పూర్తిస్థాయి సిబ్బంది నియామకం ప్రసవ సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో రైతులు భూ సమస్యల వినతి పత్రాలు అందజేయడంతో ప్రజలు సమర్పించిన భూ సమస్యల వినతులపై స్పందించిన కలెక్టర్, త్వరలో మండల, గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద కొత్తపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి సత్యం మాజీ ఎంపీటీసీ రవికుమార్ మాజీ ఉపసర్పంచ్ బి భాస్కర్ రెడ్డి రెండో వార్డు సభ్యుడు ఎండి సుల్తాన్ హౌసింగ్ ఏఈ రాజేందర్రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యుడు డి లక్ష్మీకాంత్ ఆర్ఐ శివకృష్ణ జిపిఓ స్వరూప కృష్ణయ్య బిఎల్ఓ లు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## నీట్ పీజీ కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలు: సీపీ



నిజామాబాద్,

(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 27:

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 30న నిర్వహించనున్న 'నీట్ పీజీ' (చీజుజు ా+--2026) ప్రవేశ పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. జిల్లాలో పరీక్షా కేంద్రాలుగా ఏవీ ఎంటర్‌ప్రైజెస్, అర్సపల్లిలోని మున్నూరు కాపు సంఘం, షిఫ్ట్ టెక్నాలజీస్, మల్లారంలోని అయోషా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందన్నారు. 100 మీటర్ల పరిధిలో ఆంక్షలుపరీక్ష జరిగే రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (గతంలో సెక్షన్ 144 సీఆర్‌పీసీ) అమల్లో ఉంటుందని సీపీ స్పష్టం చేశారు. ఉత్తర్వుల ప్రకారం కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరికి మించి గుమిగూడడం నిషేధమన్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఉండేందుకు సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలను ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తప్పనిసరిగా మూసివేయాలని యజమానులకు సూచించారు. ఉల్లంఘిస్తే కఠిన చర్యలుఅవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి కేంద్రం వద్ద పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభ్యర్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాసి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు (ఆల్ ది బెస్ట్) తెలియజేశారు.

## చెట్లకు 'రక్ష'.. పాలెం విద్యార్థుల వినూత్న రక్షాబంధన్!



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 27:

ప్రకృతిని ప్రసాదించిన వృక్ష సంపదను కాపాడుకోవడమే మన ప్రథమ కర్తవ్యమని చాటుతూ మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్నంగా రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. గురువారం పాఠశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా చెట్లకు రాఖీలు కట్టి మొక్కలపై తమకున్న ప్రేమను చాటుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకురాలు, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు మమత మాట్లాడుతూ.. మానవ మనుగడకు అత్యంత కీలకమైన ప్రాణవాయువును (ఆక్సిజన్) అందిస్తూ చెట్లు మనల్ని కాపాడుతున్నాయని కొనియాడారు. మనల్ని రక్షిస్తున్న వృక్షాలను సంరక్షించాల్సిన కనీస బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ స్పృహతో విద్యార్థులు చేసిన ఈ వినూత్న ప్రయత్నాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ రావు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## పోచంపల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

### జిల్లా అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ



భుదాన్ పోచంపల్లి

ఆగస్టు 27( ప్రజా కలం )

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భుదాన్ పోచంపల్లి పోలీస్ స్టేషన్‌ను గురువారం జిల్లా అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ అకస్మిక తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, స్టేషన్ డైరీ, కేసుల నమోదు, దర్యాప్తు వివరాలు, పెండింగ్‌లో ఉన్న కేసులు, పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుల వివరాలను పరిశీలించారు. ఫిర్యాదు దారుల సమస్యల ను సానుభూతితో విని, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు పోలీస్ శాఖపై మరింత నమ్మకం కలిగే విధంగా విధులు నిర్వహించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, ఫిర్యాదుదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సత్వర సేవలు అందించాలని తెలిపారు. కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ ఆవరణ, పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రత, భద్రత, రికార్డుల నిర్వహణకు సంబంధించి అవసరమైన సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, విధులకు సంబంధించిన రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను చట్టపరమైన పరిధిలో సమర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ రెడ్డి, పోచంపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ జగన్, ఎస్సై లైలా పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ప్రతి ఒక్కరి ఓటు పరిరక్షణే..SIR-2 లక్ష్యం

### - ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

భువనగిరి ఆగస్టు 27 ప్రజా కలం ప్రతినిధి

భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ా×=-2 వార్డు సభ నిర్వహించారు.ప్రజలకు మరింత చేరువగా ఉండాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే ప్రజలతో కలిసి నేలపై కూర్చొని సభ నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ప్రజలతో మమేకమై ా×=-2 కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు.ప్రతి అర్హుడి ఓటు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని,ఒక్క అర్హుడి ఓటు కూడా పోకుండా కాపాడుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి,బోనగిరి నియోజకవర్గ ా×= కోఆర్డినేటర్ ఇ.వి.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ా×=-2 కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కోరారు.ఏవైనా లోపాలు ఉన్నట్లయితే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు. ప్రతి ఓటు విలువైనదని,ప్రతి



ఓటు ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని పేర్కొంటూ ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఆర్డీఓ, తహశీల్దార్,బీఎల్ఓలు, బీఎల్ఏలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు

## నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

### - రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్. బి హరిప్రియ

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 27: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలను సమన్వయంతో, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .ఎల్. బి హరిప్రియ సూచించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులతో ఆమె సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు ప్రక్రియపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సభ్యత్వ నమోదును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.అలాగే రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలపై కమిటీకి ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు. తద్వారా కార్యక్రమాల నిర్వహణలో సమన్వయం, పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలను క్రమబద్ధంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఏ. శ్రీనివాసులు, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్ సిస్టర్స్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 27:

రక్షాబంధన్ పండగను పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి చెందిన సిస్టర్స్ గురువారం నిజామాబాద్ పోలీస్




కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సిస్టర్స్ వనజ, శ్రీలక్ష్మి తదితరులు పోలీస్ కమిషనర్‌కు రాఖీ కట్టి, మిఠాయిలు తినిపించి రక్షాబంధన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రజల్లో సోదరభావం, మానవతా విలువలను పెంపొందించడంలో పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా సిస్టర్స్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య మాట్లాడుతూ.. రాఖీ పండగ అనేది సోదర, సోదరీమణుల మధ్య ఉన్న పవిత్రమైన ప్రేమ, ఆప్యాయత, మరియు పరస్పర రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరూ సోదరభావంతో మెలుగుతూ, ప్రశాంతమైన వాతావరణంలో ఈ పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 27:

గిరిజన సమాజంలోని ఐక్యత, సంస్కృతీ సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని కేసీ తండా, వాసన్‌గుట్ట



తండాల్లో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయా తండాల్లోని జగదంబ మాయి, సంత్ సేవాలాల్ మహారాజ్‌లను దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజన సోదర సోదరీమణులతో కలిసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని, వారిని ఆత్మీయంగా పలకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంజారా సమాజానికి తీజ్ పండుగ ఎంతో ప్రత్యేకమైనదన్నారు. గిరిజనులు తమ సాంప్రదాయాలు, ఆచారాలను తరతరాలుగా కొనసాగిస్తూ భావితరాలకు అందించడం అభినందనీయమని కొనియాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ గిరిజనులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక గిరిజన పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# బహిరంగ సభను జయప్రదం చేయండి- -దాసరి పాండు, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

బొమ్మలరామారం, ఆగస్టు 27 (ప్రజా కలం)

యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని,సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో 31వ తేదీన హైదరాబాదులో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు అన్నారు గురువారం రోజున బొమ్మలరామారం మండల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం నుండి హైదరాబాద్ వరకు 29, 30,31 తేదీలలో జరుగు పాదయాత్ర 31వ తేదీన జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో ఆటో ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు పెండింగ్ ప్రాజెక్టును పూర్తి చేసి సాగు,త్రాగునీరు అందిస్తామని చెప్పి ప్రాజెక్టులు పూర్తి చేయడం కోసం బడ్జెట్ కేటాయించడం లేదని చెప్పిన మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయని అన్నారు సాగు,త్రాగునీరు లేక రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు ఉపాధి కొరకై పట్టణాలకు వరుస వెళుతున్నారని శామీర్పేట చెరువును రిజర్వాయర్ చేస్తే బొమ్మలరామారం మండలంలో సాగునీరుకు ఉపయోగపడుతుందని గ్రౌండ్ వాటర్ పెరిగి త్రాగునీరు సమస్య పరిష్కారం అవుతుందని అని అన్నారు ప్రజలందరికీ ఉపాధి దొరుకుతున్నదని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సాగు త్రాగునీటికి ఉపయోగపడే పెండింగ్ ప్రాజెక్టుల కోసం బడ్జెట్ కేటాయించి జిల్లాలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలని అన్నారు ప్రాజెక్టులు కాలువలు పూర్తి కై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్ర,బహిరంగ సభకు ఉద్యమానికి భారీగా రైతులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం,నాయకులు పున్నమ్మ, మంగ,పద్మ,రాజు తదితరులు పాల్గొన్నారు

# దిల్వార్‌గూడలో వ్యక్తి అదృశ్యం

మహేశ్వరం, ఆగస్టు 27, ప్రజా కలం

దిల్వార్‌గూడ గ్రామంలో ఆలూరి శ్రీకాంత్ (31) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ మేరకు ఆయన బంధువు నర్రె జ్యోతి మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం చర్లపటేల్‌గూడకు చెందిన ఆలూరి శ్రీకాంత్ సుమారు ఐదేళ్ల క్రితం గుమ్మడివెల్లి గ్రామానికి చెందిన



మనీషాను వివాహం చేసుకున్నాడు. కొంతకాలం వారి సంసారం సజావుగా సాగినప్పటికీ, గత రెండేళ్లుగా కుటుంబ కలహాలు ఏర్పడ్డాయి. పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో గత ఎనిమిది నెలల క్రితం విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఆ తర్వాత శ్రీకాంత్ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. గత వారం క్రితం కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శ్రీకాంత్‌ను గుర్తించగా, అప్పటి నుంచి దిల్వార్‌గూడలోని తమ బంధువు ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో మార్చి 23న సాయంత్రం 7.30 గంటల సమయంలో జ్యోతి తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల గ్రామమైన బ్రహ్మణపల్లికి వెళ్లింది. రాత్రి 11.30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చేసరికి శ్రీకాంత్ కనిపించలేదు. అతని సెల్‌ఫోన్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌లో ఉన్నట్లు తెలిసింది. పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. శ్రీకాంత్ ఎత్తు సుమారు 5.5 అడుగులు, తెల్లటి ఛాయ, ఓవల్ ముఖాకృతి కలిగి ఉంటాడని, తెలుగు మాట్లాడుతాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదృశ్యమైన సమయంలో బ్రౌన్ కలర్ షర్ట్, బ్లూ కలర్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. శ్రీకాంత్ ఆచూకీ కనుగొని, కుటుంబ సభ్యులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారురాలు పోలీసులను కోరారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడి, మెరుగైన ఆదాయం పొందేలా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలి

## -యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

బొమ్మలరామారం, ఆగస్టు 27 (ప్రజా కలం)

రైతులకు అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ, ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించాలని, పంటలకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం, మేడిపల్లి గ్రామంలో చేపడుతున్న పాలీహౌస్, కూరగాయల సాగును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ముందుగా టి.వినయ్ భూషణ్ పాలీహౌస్‌లో సాగు చేస్తున్న జెర్బెరా పూలను కలెక్టర్ పరిశీలించి,రైతుతో సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఎన్ని ఎకరాల్లో పాలీహౌస్ ఏర్పాటు చేశారు,ఎన్ని సంవత్సరాలుగా జెర్బెరా పూల సాగు చేస్తున్నారు,వార్షికంగా సాగుకు ఎంత ఖర్చు అవుతుంది,ఎంత ఆదాయం వస్తుంది పూలను ఎక్కడ విక్రయిస్తున్నారని వివరాలను అడిగి తెలుసుకున్నారు.మార్కెటింగ్ విధానం ఎలా ఉంది,జెర్బెరా సాగును ఎంచుకోవడానికి గల కారణాలు ఏమిటి,సాగుకు ఎంత నీరు అవసరమవుతుంది తదితర వివరాలను



కలెక్టర్ తెలుసుకున్నారు.పాలీహౌస్ ద్వారా పూల సాగు చేపట్టడం వల్ల కలిగే ప్రయోజనాలు,పంట దిగుబడి, మార్కెటింగ్ అవకాశాలను పరిశీలించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడి,మెరుగైన ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని సంబంధిత అధికారులను సూచించారు.

అనంతరం అదే గ్రామంలో మరో రైతు నుక్క గణేష్ సాగు చేస్తున్న టమాటా,మిర్చి పంటలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఎన్ని సంవత్సరాలుగా ఈ పంటలను సాగు చేస్తున్నారు, ఎకరాకు ఎంత దిగుబడి వస్తుంది,పంట సాగుకు అయ్యే ఖర్చు, లభిస్తున్న ఆదాయం తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు.పండించిన టమాటా,మిర్చిని స్థానిక మార్కెట్‌లో విక్రయిస్తున్నారా లేదా ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారా అనే విషయాలను కూడా తెలుసుకున్నారు.రైతులకు అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ,ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించాలని,పంటలకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.పాలీహౌస్‌లలో జెర్బెరా వంటి పూల సాగుకు అనుకూలమైన నియంత్రిత వాతావరణం,నీటి నిర్వహణ వంటి అంశాలు కీలకమని వ్యవసాయ సాంకేతిక వనరులు కూడా సూచిస్తున్నాయి.పంట మార్పిడి విధానంలో భాగంగా జిల్లా కలెక్టర్ వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలైన కూరగాయలు,పూలు ఆయిల్ పామ్ మరియు ఇతర ఉద్యాన పంటలవైపు రైతులు మొగ్గు చూపాలని అదేవిధంగా తక్కువ నీటితో డ్రిప్ ద్వారా సాగు చేసి నీటిని ఆదా చేసుకోనీ ఆర్థికంగా రైతులు లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి హేమలత,ఉద్యాన అధికారి కె.కవిత,గ్రామ సర్పంచ్ వేముల శ్రీలత నరేష్,ఉప సర్పంచ్ కె.కృష్ణ ,వార్డు సభ్యులు,మండల ఏఈఓ, హెచ్ఈఓ ఎం.మంజుల, ఆయిల్ఫెడ్ ఫీల్డ్ అసిస్టెంట్ కె.మౌనిక,రైతులు పాల్గొన్నారు

# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి-- ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

బొమ్మలరామారం, ఆగస్టు 27 (ప్రజా కలం)

అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా,ఎలాంటి పొరపాట్లు లేకుండా జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధికారులకు సూచించారు.యాదాద్రి భువనగిరి జిల్లా,బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్,రామస్వామి తండా గ్రామాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా గురువారం రోజున నిర్వహించిన గ్రామ సభల్లో బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సభల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలను ఆయన పరిశీలించారు.అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా,ఎలాంటి పొరపాట్లు లేకుండా జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.అనంతరం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా అధికారులు గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఓటర్ల జాబితాలో తమ పేరు,వయస్సు, చిరునామా తదితర వివరాలను పరిశీలించుకోవడంతో పాటు,అర్హత ఉన్నప్పటికీ జాబితాలో పేరు లేని వారు సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు లేదా ఇతర కారణాలతో అనర్హులైన వారి పేర్లపై కూడా అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలన చేపట్టాలని తెలిపారు.గ్రామ సభల ద్వారా ఓటర్ల జాబితాలోని వివరాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించిన ఎమ్మెల్యే,ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా సవరణ ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా,ప్రతి ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకునేలా ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు.

ప్రజా ప్రభుత్వం గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి దూరం కాకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో రంగాపూర్ సర్పంచ్ యంజాల సరస్వతి గణేష్, రామస్వామి తండా సర్పంచ్ సునీత వెంకటేష్, పిఎసిఎస్ చైర్మన్ సింగర్తి మల్లేశం,భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర సత్యనారాయణ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యంజాల కళ,ఇన్చార్జ్ తాహసిల్దార్ సునీల్ కుమార్, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ కొండం వెంకట్ రెడ్డి, మండల సీనియర్ అసిస్టెంట్ శోభారాణి, ఉపసర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు మైలారం సుదర్శన్, శ్రీరాములు నాయక్,రాష్ట్ర ఆదివాసి సెక్రెటరీ రాజు నాయక్, రామిడి జంగారెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు,పిఎసిఎస్ డైరెక్టర్లు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# స్మార్ట్ రేషన్ కార్డులపై ఆర్అండ్ఆర్ కాలనీ పేరు పునరుద్ధరించాలి

## నిర్వాసితుల ప్రత్యేక గుర్తింపును తొలగించడం బాధాకరం: బిఆర్ఎస్ నాయకులు కొలిచేలిమి స్వామి

గజ్వేల్:27 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన ఆర్అండ్ఆర్ కాలనీలో జారీ చేస్తున్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులపై 'ఆర్అండ్ఆర్ కాలనీ' పేరును తొలగించి 'ముట్రాజ్‌పల్లి--సంగాపూర్' పేర్లను ముద్రించడం శోచనీయమని మల్లన్న సాగర్ ముంపు గ్రామం లక్ష్మాపూర్ తాజా మాజీ సర్పంచ్ కొలిచేలిమి స్వామి, బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.నిర్వాసితుల ప్రత్యేక గుర్తింపును కాపాడుతూ రేషన్ కార్డులపై ఆర్అండ్ఆర్ కాలనీ పేరును తక్షణమే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రజలు తమ ఇళ్లు, భూములు, గ్రామాలను త్యాగం చేసి నిర్వాసితులుగా మారారని, అలాంటి వారికి ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాల్సింది పోయి కనీసం వారి ప్రత్యేక చిరునామా, గుర్తింపును కూడా తొలగించే విధంగా వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు.గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 30 శాతం ఓటర్లను కలిగి ఉన్న నిర్వాసిత కాలనీకి ప్రత్యేక గుర్తింపు లేకుండా చేయడం వారి హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. మల్లన్నసాగర్ నిర్వాసితులు ఇప్పటికే పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు, ఓపెన్ ప్లాట్లు, ఇతర హక్కులకు సంబంధించి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ పరిస్థితుల్లో స్మార్ట్ రేషన్ కార్డులపై కూడా ఆర్అండ్ఆర్ కాలనీ పేరును తొలగించడం నిర్వాసితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి



నిదర్శనమని అన్నారు. వెంటనే రేషన్ కార్డులలో చిరునామాను లిలి''ఆర్అండ్ఆర్ కాలనీ, వేములఘాట్,ఏటిగడ్డ కిష్టాపూర్,పల్లెపాహడ్, ఎర్రవల్లి,లక్ష్మాపూర్,బ్రాహ్మణ బంజర్‌పల్లి,సింగారం, గా సరిచేసి,నిర్వాసిత కాలనీకి ఉన్న ప్రత్యేక గుర్తింపును కొనసాగించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే నిర్వాసితుల హక్కులు,కాలనీ గుర్తింపు కోసం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, ఆర్అండ్ఆర్ కాలనీ లక్ష్మాపూర్‌కు చెందిన కొలిచేలిమే స్వామితో పాటు బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వానికి ఈ డిమాండ్‌ను వెల్లడించారు.

# లేమూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన గ్రామ సర్పంచ్ ఎలుక మేఘనాథ్ రెడ్డి మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి



మహేశ్వరం, ఆగస్టు 26,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం కేంద్రం లేమూర్ గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు.రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిధుల నుండి మంజూరైన రూ. 10 లక్షల వ్యయంతో ఈ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. గ్రామ సర్పంచ్ ఎలుక మేఘనాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి గారి చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ దిల్లీ శ్రీధర్, ఉప సర్పంచ్ ఇమ్మిడి జంగయ్య, వార్డు మెంబర్లు గుల్వి కృష్ణ, సూరసాని శ్రీకాంత్ రెడ్డి, దిల్లీ బాలకృష్ణ, గుల్వి జైపాల్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహ్మద్ రహీమ్, భరత్ రెడ్డి, సాత్విక్ రెడ్డి, ఆలయ పూజారి గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలతో పోలీసుల రాఖీ వేడుకలు





మల్కాజిగిరి, ఆగస్టు 27(ప్రజా కలం ప్రతినిధి): మల్కాజిగిరి పోలిసు కమిషనర బి. సుమతి ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలిసి పోలీసులు రాఖీ పండుగను నిర్వహించారు. ఇందులో భాగంగా నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటయ్య మాట్లాడుతూ మహిళలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. మహిళలు తమ పరిసర ప్రాంతాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నేరాల నియంత్రణలో పోలీసులతో కలిసి మహిళలు కూడా తమవంతు బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. మహిళల భద్రత, నేరాల నియంత్రణకు పోలీసులతో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పోలీసులకు, ప్రజలకు మధ్య స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే రాఖీ వేడుకల ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేరేడ్‌మెట్ పోలీస్ సిబ్బంది, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# అక్కప్రేమకు ప్రతిరూపంగా బిస్కెట్లతో 10 అడుగుల భారీ రాఖీ

గజ్వేల్:27 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

అక్కపై ఉన్న అపారమైన ప్రేమకు గుర్తుగా,ఆమె మధుర జ్ఞాపకాలను రాఖీ రూపంలో నిలిపేందుకు గజ్వేల్‌కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు,భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు వినూత్న ప్రయత్నం చేశారు. వివిధ రకాల బిస్కెట్లతో 10 అడుగుల భారీ రాఖీ చిత్రాన్ని రూపొందించి గురువారం ఆవిష్కరించి తన అక్కకు అంకితం చేశారు.మూడు రోజులపాటు శ్రమించి ఎంతో ప్రేమతో ఈ భారీ రాఖీ చిత్రాన్ని రూపొందించినట్లు రామకోటి రామరాజు తెలిపారు."అమ్మ తర్వాత అమ్మలా ఆప్యాయతను పంచిన నా అక్క ప్రతి సంవత్సరం నా చేతికి రాఖీ కట్టేది.ఆమె కట్టిన రాఖీ నాకు కేవలం దారం కాదు.. ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని నింపేది" అని ఆయన భావోద్వేగంతో పేర్కొన్నారు. అక్క కట్టిన రాఖీతో బలం పొందిన ఈ చేతితోనే నేడు లక్షలాది మంది భక్తులతో శ్రీరామ నామాన్ని లిఖింపజేస్తున్నానని,అదే చేతితో ఎన్నో దేవతా చిత్రాలను రూపొందించి ప్రజల అభిమానంతో పాటు అనేక అవార్డులను అందుకున్నానని తెలిపారు.తన కళకు,సేవకు అక్క ప్రేమే ప్రధాన స్ఫూర్తి అని రామరాజు చెప్పారు.గతంలోనూ అక్క జ్ఞాపకాలను సజీవంగా ఉంచేందుకు పలు రాఖీ చిత్రాలను రూపొందించినట్లు తెలిపారు. అక్కా--తమ్ముడి మధ్య చెరగని ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలిచిన ఈ భారీ రాఖీ చిత్రాన్ని తిలకించిన ప్రజలు, ప్రముఖులు రామకోటి రామరాజును అభినందించారు.



# అయ్యప్ప స్వామి ఆలయంలో ఘనంగా శ్రావణ మాసం పూజలు

గజ్వేల్:27 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్--లతా దంపతులు,రెండో వార్డు కౌన్సిలర్ గోలి మమత--సంతోష్ దంపతులు, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి,విశేష పూజలు చేశారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు బొగ్గుల సురేష్ గురుస్వామి మాట్లాడుతూ గజ్వేల్ శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహించే కార్యక్రమాన్ని గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. శ్రావణ మాసం నెల రోజుల పాటు ప్రతిరోజూ దంపతులచే స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ,కోశాధికారి నారాయణరెడ్డి,కార్యదర్శి గోపి,నాయకులు గందె యాదగిరి,మర్యాల శ్రీనివాస్, లక్ష్మారెడ్డి,గంగిశెట్టి వెంకటేశం,కైలాస ప్రశాంత్,దేవానంద్,డెంటల్ శ్రీనివాస్,అంజయ్య,విక్రాంత్,దీపక్,గందె సంతోష్‌తో పాటు అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# 108 అంబులెన్స్‌లో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన గిరిజన మహిళ



మహేశ్వరం, ఆగస్టు 26,(ప్రజా కలం)

మహేశ్వరం మండలం కేసీ తండాకు చెందిన రాహుల్, రీతు దంపతులకు 108 సిబ్బంది అందించిన సకాలంలో సాయంతో పండంటి మగబిడ్డ జన్మించాడు.రీతుకు ఇది తొలి కాన్పు. పురిటి నొప్పులు తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను మహేశ్వరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని పేట్లబుర్జు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి రిఫర్ చేశారు.దీంతో 108 అంబులెన్స్‌లో ఆమెను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు మరింత ఎక్కువయ్యాయి. వెంటనే అప్రమత్తమైన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ సురేందర్, పైలట్ యాదయ్య అంబులెన్స్‌ను సురక్షితంగా పక్కకు నిలిపారు. అంబులెన్స్‌లోనే సమయస్ఫూర్తితో వ్యవహరించి సాధారణ ప్రసవం చేశారు. రీతు పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.అనంతరం తల్లీబిడ్డలను పేట్లబుర్జు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సురక్షిత ప్రసవం చేసిన 108 సిబ్బందిని కుటుంబ సభ్యులు, బంధువులు అభినందించారు.

# కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తా

## ప్రశాంతి హిల్స్ డివిజన్ యూత్ అధ్యక్షులుగా వరికుప్పల శివ



మహేశ్వరం, ఆగస్టు 26, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి 58 ప్రశాంతి హిల్స్ డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా వరికుప్పల శివ నియమితులయ్యారు. ఆయన గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ నీ నమ్ముకుని నిరంతరం పార్టీ కోసం కృషి చేస్తున్నా ఆయనని పార్టీ అధిష్టానం గుర్తించి మంగళవారం రోజు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా మీద నమ్మకంతో అధ్యక్ష పదవి ఇచ్చినందుకు సంతోషిస్తూ నన్ను అని రాష్ట్ర అధ్యక్షులు కి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి కి రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ సంతోష్ గౌడ్ కి మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షులు సుభాన్ యాదవ్ కి స్టేట్ సెక్రెటరీ సామిడి చెరణ్ రెడ్డి కి ముఖ్యంగా నాకు సహకరించిన మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ కె ఎల్ ఆర్ కి తెలంగాణ పిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలి - రంగారావు



కూకట్ పల్లి, ఆగస్టు 27, ప్రజా కలం ప్రతినిధి:

ప్రజలను ఇబ్బంది పెట్టకుండా 'సర్' ప్రక్రియ నిర్వహించాలనీ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిటర్నింగ్ ఆఫీసర్ వహీద్ అలీ ని కోరిన మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు.

సర్ పక్రియలో భాగంగా బాగ్ అమీర్ వార్డ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమములో రంగారావు పాల్గొని, శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్‌లో సర్ ప్రోగ్రాంలో భాగంగా గత నెలలో ప్రజలందరి నుంచి పత్రాలు సేకరించడం జరిగింది, అయితే ప్రస్తుతం చిన్న చిన్న విషయాలకు కూడా ప్రజలకు నోటీసులు జారీ చేసి, సర్ ప్రక్రియ పేరుతో ఓటర్లను వార్డు కార్యాలయాలకు పిలిపించి భయభ్రాంతులకు గురిచేయడం కాకుండా, వారి వివరాల్లో ఉన్న లోపాలను సరిచేసుకునేందుకు పూర్తి అవకాశం కల్పించి, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం అధికారుల బాధ్యత అని, అవసరమైన చోట అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకే వెళ్లి పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమములో బిఆర్ఎస్ బీఎల్ ఏ లు ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, బాబు, రవీందర్ తదితరులు పాలుగొన్నారు.

# 20వ వార్డులో ఎస్ఐఆర్-2026 వార్డు సభ

గజ్వేల్:27ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ -2026లో భాగంగా గురువారం వార్డు సభ నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ సమక్షంలో జరిగిన ఈ సభలో ఓటరు ఎన్యుమరేషన్ ఫారాల్లో అసంపూర్తి వివరాలతో దరఖాస్తు చేసిన ఓటర్లకు బీఎల్ఓలు నోటీసులు అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాల్లో పేర్కొన్న గడువులోగా వ్యక్తిగత అడ్రస్ ప్రూఫ్‌తో పాటు అవసరమైన పత్రాలను జతచేసి మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ వివరాలను



పరిశీలించుకుని, అవసరమైన పత్రాలను సమర్పించి ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో బీఎల్ఓ మంజులతో పాటు వార్డు ప్రజలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జలమండలిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఈటలకు వినతి

మల్కాజిగిరి ఆగస్టు 27 (ప్రజా కలం ప్రతినిధి)

జలమండలిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్‌కేవీ మల్కాజిగిరి అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు కార్మిక సంఘం నాయకులతో కలిసి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.



ఈ సందర్భంగా జలమండలి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కేటగిరీ--2 కార్మికుల సమస్యలతో పాటు విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌కేవీ నాయకులు అశోక్, ప్రసాద్,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి పోలీసులు మహిళా సంఘాలతో రాఖీ వేడుకలు

మల్కాజిగిరి, ఆగస్టు 27 (ప్రజా కలం ప్రతినిధి) మల్కాజిగిరి పోలీసు కమిషనర్ బి. సుమతి ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలిసి పోలీసులు రాఖీ పండుగను నిర్వహించారు. ఇందులో భాగంగా మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ



విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో కస్తూరిబా నగర్ లో రాఖీ వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. మహిళలు తమ పరిసర ప్రాంతాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.నేరాల నియంత్రణలో పోలీసులతో కలిసి మహిళలు కూడా తమవంతు బాధ్యతగా ముందుకు రావాలని కోరారు.

మహిళల భద్రత, నేరాల నియంత్రణకు పోలీసులతో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పోలీసులకు, ప్రజలకు మధ్య స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే రాఖీ వేడుకల ఉద్దేశమని తెలిపారు. సీఐ తో పాటు సెక్టార్ ఎస్ఐలు శంకర్, శ్రీనివాస్ దుర్గా నగర్ లో మల్కాజిగిరిలో సహచర బృందం మహిళలతో, మహిళా పోలీస్ సిబ్బందితో రాఖీ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు.

# 11వ వార్డులో ఎస్ఐఆర్ ఓటరు సవరణ వార్డు సభ

గజ్వేల్:27 ఆగస్టు 2026(ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్-2026లో భాగంగా గురువారం వార్డు సభ నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ కొలిచేలిమి భవాని కర్ణాకర్ సమక్షంలో జరిగిన ఈ సభలో ఓటరు ఎన్యుమరేషన్ ఫారాల్లో అసంపూర్తి వివరాలతో దరఖాస్తు చేసిన ఓటర్లకు బీఎల్ఓలు నోటీసులు అందజేశారు.ఈ సందర్భంగా బీఎల్ఓలు,వార్డు కౌన్సిలర్ భవాని కర్ణాకర్ మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాల్లో




పేర్కొన్న గడువులోగా వ్యక్తిగత అడ్రస్ ప్రూఫ్‌తో పాటు అవసరమైన పత్రాలను జతచేసి మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.ఓటరు జాబితా సవరణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ వివరాలను పరిశీలించుకుని,అవసరమైన పత్రాలను సమర్పించి ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు,లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచేలిమి స్వామి,పర్శరాములు,కర్ణాకర్,జమీల్, వార్డు ప్రజలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### కుల గణన చేపట్టకుంటే బీజేపీని

# బీసీ సామాజిక వర్గం క్షమించదు

### బిసి పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి..

వనపర్తి : బీసీ కులగణన చేపట్టకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తే దేశవ్యాప్తంగా బీసీలను ఏకం చేసి బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి హెచ్చరించారు. బిసి పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో బుధవారం రోజున మీడియా సమావేశం నిర్వహించిన కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్కర్నూల్ జిల్లా అధ్యక్షులు ధన్నోజు అరవింద్ చారి మాట్లాడుతూ కేంద్రం చేపడుతున్న జనగణన లలో బీసీల కుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ ఏర్పాటు చేయాలని, డిమాండ్ చేశారు. మండల కమిషన్ సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన 42% బీసీ రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం పొందేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. బీసీల జనాభా లెక్కలు తెలితే రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందని భయంతోనే కేంద్రం వెన్నుకడుగు వేస్తుంది అని ఆరోపించారు.

## జగ్గంపేట గడ్డపై ప్రజా నాయకుడు

జగ్గంపేట : నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర అధికార పార్టీ అరాచకాలను, అవినీతిని ఎదిరించి నిలబడుతూ, నిత్యం ప్రజల పక్షాన నిలిచే నిజమైన ప్రజా నాయకుడిగా ఇండిపెండెంట్ అభ్యర్థి పాఠం శెట్టి సూర్యచంద్రనియోజకవర్గంలో ప్రజల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు.

# మోసానికి పాల్పడిన నిందితుడి అరెస్ట్



## మోసానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన ఆదిభట్ల పోలీసులు

మహేశ్వరం, ఆగస్టు 26,(ప్రజా కలం) మోసానికి పాల్పడిన నిందితుడిని ఆదిభట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. క్రైమ్ నంబర్ 671/2026 U/s 316(2), 318(4) బి ఎన్ ఎస్ వి ఐ పి కోటాలో తక్కువ ధరకు కారు, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పిస్తానని నమ్మించి రూ. 14.77 లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడిన నిందితుడిని ఆదిభట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. మీగడ మురళి (40), పూజారి, రావిరాల గ్రామం, మహేశ్వరం మండలం, రంగా రెడ్డి జిల్లా. నూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. నిందితుడు తాటిపల్లి నవీన్ గౌడ్ (34), వ్యాపారం, అనాజ్‌పూర్ గ్రామం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా. కేసు వివరాలు ఆలయంలో పరిచయం సమయంలో నిందితుడు తనకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, రాజకీయంగా పలుకుబడి ఉందని నమ్మించాడు. వి ఐ పి కోటా ద్వారా తక్కువ ధరకు కొత్త కారు ఇప్పిస్తానని చెప్పి విడతల వారీగా రూ. 11,00,000/- తీసుకున్నాడు. అదేవిధంగా ఇబ్రహీంపట్నంలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని చెప్పి ప్రాసెసింగ్ ఖర్చుల పేరుతో మరో రూ. 3,77,150/- తీసుకున్నాడు. మొత్తం రూ. 14,77,150/- తీసుకున్నా కారు, ఇల్లు ఇప్పించకుండా కాలయాపన చేశాడు. డబ్బులు తిరిగి అడిగితే "అందరిముందు నా పరువుకు భంగం కలిగించావు, నీపై రూ. 50 లక్షలకు పరువు నష్టం దావా వేస్తాను" అని బెదిరించినట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు. దీంతో ఫిర్యాదు మేరకు ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ఈరోజు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసుల విచారణలో నిందితుడు గతంలో కూడా పలు మోసాలకు పాల్పడినట్లు తేలింది. అబ్దుల్లాపూర్‌మెట్, ఎల్‌బి నగర్, మహబూబ్ నగర్ పోలీస్ స్టేషన్లలో ఇతనిపై ఇప్పటికే 4 చీటింగ్ కేసులు నమోదై ఉన్నాయి. రాజకీయ నాయకులతో పరిచయాలు ఉన్నాయని, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, కార్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఎటువంటి మొత్తం చెల్లించవద్దు. వెంటనే సంబంధిత ప్రభుత్వ అధికారులను లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆదిభట్ల పోలీసులు తెలిపారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## మూడేళ్ల పాలనలో కనీసం రోడ్లపై గుంతలను కూడా పూడ్చలేదు: హరీశ్ రావు



గజ్వేల్:27 ఆగస్టు
ప్రజా కలం (ప్రతినిధి)

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే,బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్లపై ఏర్పడిన గుంతలను కూడా పూడ్చలేని దుస్థితి నెలకొందని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని వర్గల్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు గురువారం కోకాపేటలో బీఆర్ఎస్‌లో చేరారు. గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హరీశ్ రావు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో వార్డు సభ్యులు కిష్టనుల్ల మనోహర, తలారి లక్ష్మి, మామిండ్ల



యాదమ్మ, నాణెపురం స్వామి, మామిండ్ల కుమార్ యాదవ్, తలారి కళ్యాణి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నందు, మక్తల రవీందర్, రంగ మహేందర్, శ్రీనివాస్ రెడ్డి, దాచ బాలరాజు, బిక్షపతి, కిష్టయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో విసుగు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. మూడేళ్ల పాలనలో రాష్ట్రం అధ్వాన పరిస్థితికి చేరిందని, అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాల కల్పనలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్ల పాలనలో గజ్వేల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చెంది రాష్ట్రానికే కాకుండా దేశానికే ఆదర్శంగా నిలిచిందని హరీశ్ రావు పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిందన్నారు. ప్రస్తుతం కుంటుపడిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపించే సత్తా, దార్శనికత కేసీఆర్ నాయకత్వానికే ఉందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని, గజ్వేల్ గడ్డపై సగర్వంగా ఎగిరేది గులాబీ జెండానే అని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమని పార్టీలో చేరిన నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయ భారతి, మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వేలూరి కృష్ణారెడ్డి, వేలూరి రామచంద్రారెడ్డి, ఇరి రామకృష్ణారెడ్డి, టేకులపల్లి రవీందర్ రెడ్డి, తుంకుంట ప్రభాకర్ రెడ్డి, సయ్యద్ ఫయాజ్, దేవగనిక సతీష్ మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఓణం సెలబ్రేషన్స్‌లో మానస వారణాసి

టాలీవుడ్ అందాల భామ ఫెమినా మిస్ ఇండియాగా మన దేశ గుండెచప్పుడుగా మారిన మానస వారణాసి, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలతో కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. పండుగ వేళ కుందనపు బొమ్మలా మెరిసిపోతూ నెటిజన్లను కట్టిపడేసింది. పచ్చని ప్రకృతి ఒడిలో సంప్రదాయ దుస్తుల్లో ఆమె ఇచ్చిన పోజులు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. పద్ధతిగల చీరకట్టులో మానస చందమామలా మెరిసిపోతున్న ఈ క్యూట్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఓణం పండుగను పురస్కరించుకుని మానస ఎంచుకున్న అవుట్‌ఫిట్ ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. 'భువి శారీస్' డిజైన్ చేసిన క్లాసిక్ ఆఫ్-వైట్ కేరళ కసవు చీరలో ఆమె మెరిసిపోయింది. ఇక చీర అంచున ఉన్న మెరిసే గోల్డెన్ జరీ బోర్డర్, చిన్న చిన్న చుక్కల డిజైన్ ఆమెకు రాయల్ లుక్‌ను తెచ్చిపెట్టాయి. ఈ కేరళ సంప్రదాయ చీరకట్టులో మానస పక్కా సౌత్ ఇండియన్ రాకుమారిలా కనిపిస్తోందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. వైట్ శారీకి కాంబినేషన్‌గా మానస వేసుకున్న డార్క్ గ్రీన్ బ్రోకేడ్ బ్లౌజ్ ఈ ఫోటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోచేతి వరకు ఉన్న ఈ డిజైనర్ బ్లౌజ్‌పై చేసిన వర్క్ ఆమె అవుట్‌ఫిట్‌కు మరింత లుక్‌ని ఇచ్చింది. ఇక దీనికి తోడు మెడలో వేసుకున్న హారం, మ్యాచింగ్ చెవి దిద్దులు, నుదుటన ఎర్రటి బొట్టు, తలలో మల్లెపూలు తురుముకుని పక్కా పండుగ కళను నింపుకుంది.

# విజయ్‌కు కావాల్సింది హిట్ మాత్రమే కాదు!

టాలీవుడ్‌లో కొంతమంది హీరోలకు ఒక సినిమా సక్సెస్ కంటే.. ఆ సక్సెస్ తర్వాత ఏర్పడే మార్కెట్ ఇంపాక్ట్ మరింత కీలకంగా మారుతుంది. అలాంటి దశలోనే ఇప్పుడు విజయ్ దేవరకొండ కనిపిస్తున్నారు. అర్జున్ రెడ్డి, గీత గోవిందం వంటి సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన మార్కెట్‌ను క్రియేట్ చేసుకున్న విజయ్.. ఆ తర్వాత వరుస సినిమాలతో అదే స్థాయి బాక్సాఫీస్ ప్రభావాన్ని కొనసాగించలేకపోయారు. దీంతో ఇప్పుడు రాబోయే రణబాలిపై కేవలం సినిమా రిజల్ట్ కోసమే కాకుండా, విజయ్ మార్కెట్ మళ్లీ ఏ స్థాయికి వెళ్తుందనే ఆసక్తి నెలకొంది. ఇక్కడ రణబాలి సినిమాకి ఎదురవుతున్న అసలు ఛాలెంజ్ కలెక్షన్లను సాధించడం మాత్రమే కాదు. విజయ్ సినిమాకు గతంలో ఉన్న ఓపెనింగ్ క్రేజ్, థియేట్రికల్ డిమాండ్, బిజినెస్ వాల్యూ మళ్లీ పెరగడం కూడా అంతే ముఖ్యం. ఒక సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలవడం టెంపరరీ



సక్సెస్ ను ఇవ్వొచ్చు. కానీ ఆ సినిమా తర్వాత హీరో నెక్ట్స్ ప్రాజెక్ట్‌పై మార్కెట్‌లో ఏర్పడే నమ్మకమే అసలు స్టార్ మార్కెట్‌కు కొలమానంగా చూస్తారు. ఈ విషయంలో రణబాలి విజయ్‌కు కీలకమైన పరీక్షగా మారనుంది. ఈ సినిమాకు మరో ఆసక్తికర అంశం విజయ్- రాహుల్ సంకృత్యాన్ కాంబినేషన్. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ట్యాక్సీవాలా విజయ్ కెరీర్‌లో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. పరిమిత వనరులతో విభిన్నమైన కథను చెప్పిన ఆ సినిమా.. రాహుల్‌లోని కొత్తదనం, విజయ్‌లోని ఎనర్జీకి మంచి కాంబినేషన్ ఉందనే నమ్మకాన్ని కలిగించింది. ఇప్పుడదే కాంబినేషన్ మరింత భారీ స్థాయిలో, భిన్నమైన నేపథ్యంతో ప్రేక్షకుల ముందుకు రావడం ఆసక్తిని పెంచుతోంది. అయితే ఈసారి కేవలం కాంబినేషన్ మీదే సినిమా ఆధారపడే పరిస్థితి లేదు. కథ, క్యారెక్టర్, విజువల్ స్కేల్, పీరియడ్ నేపథ్యం, ఎమోషన్.. ఇవన్నీ కలిసి ఆడియన్స్‌కు థియేటర్ ఎక్స్‌పీరియెన్స్ ను ఇవ్వాల్సి ఉంటుంది. ముఖ్యంగా విజయ్‌ను మరోసారి భారీ ఓపెనింగ్స్ తీసుకురాగల స్టార్‌గా నిలబెట్టాలంటే సినిమా మొదటి రెస్పాన్స్ తో పాటు లాంగ్ రన్ కూడా స్ట్రాంగ్ గా ఉండాలి. అందుకే రణబాలి విజయ్‌కు మరో హిట్‌గా మిగిలిపోతుందా? లేక అతని మార్కెట్‌ను కొత్త స్థాయికి తీసుకెళ్లే సినిమాగా మారుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. సినిమా రిజల్ట్ తో పాటు దాని తర్వాత విజయ్‌పై ఏర్పడే బిజినెస్ నమ్మకమే ఈ జర్నీలో అసలైన సక్సెస్ గా నిలవనుంది.

## మూడోసారి డేటింగ్ ఫెయిల్.. 'లైగర్' బ్యూటీ సమస్యేంటి?



విజయ్ దేవరకొండ సరసన లైగర్ చిత్రంలో నటించిన బాలీవుడ్ భామ అనన్య పాండే ప్రస్తుతం వార్తల్లో నిలిచారు. మాజీ మోడల్ వాకర్ బ్లాంకోతో సాగించిన దాదాపు రెండేళ్ల ప్రేమాయణానికి ఈ బ్యూటీ స్వస్తి పలికినట్లు జాతీయ మీడియా వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. వీరిద్దరూ తమ సంబంధాన్ని అధికారికంగా ఎప్పుడూ ప్రకటించనా పలు బహిరంగ కార్యక్రమాలు , సోషల్ మీడియా పోస్టుల ద్వారా డేటింగ్‌లో ఉన్నారనే వార్తలు గతంలో బలంగా వినిపించాయి. అనన్య పాండే-వాకర్ బ్లాంకోల పరిచయం 2024 మధ్యలో జరిగిన అనంత్ అంబానీ, రాధికా మర్చంట్‌ల ప్రీ-వెడ్డింగ్ వేడుకల్లో మొదలైంది. చికాగోకు చెందిన మోడల్ వాకర్ వైల్డ్‌లైఫ్ - జంతు సంరక్షణపై ఆసక్తి కలిగి బాలీవుడ్ ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే అనన్యతో ప్రేమలో పడిన తర్వాత ప్రియురాలి పుట్టినరోజు సందర్భంగా -హ్యాపీ బర్త్‌డే బ్యూటిఫుల్.. ఐ లవ్ యు- అని పోస్ట్ చేయడం వీరి సంబంధానికి బలమైన రుజువుగా మారింది. అంతేకాకుండా..అనన్య పాండే .. వాకర్ బ్లాంకో పేరును ఇనిషియల్‌తో కూడిన పెండెంట్‌ను ధరించడం కూడా సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే ఇటీవలి కాలంలో వీరిద్దరూ విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు సన్నిహిత వర్గాల ద్వారా కథనాలు వెలువడుతున్నాయి. తమ వ్యక్తిగత విషయాలను రహస్యంగా ఉంచడానికే ఇద్దరూ మొగ్గు చూపినా ఈ బ్రేకప్ వార్త బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం అనన్య పాండే తన నటనా వృత్తిపైనే పూర్తి దృష్టి సారించారు. ప్రేమ బంధాల గురించి గతంలో మాట్లాడిన ఈ యంగ్ బ్యూటీ షారుఖ్ ఖాన్ చెప్పినట్లు నాకు ప్రేమ అంటే స్నేహమే..అనుబంధంలో నమ్మకమే ప్రధానం అని వ్యాఖ్యానించారు. విడిపోయినా ఇన్‌స్టాలో వీరిద్దరూ ఇప్పటికీ ఒకరినొకరు ఫాలో చేసుకుంటుండటం విశేషం. యంగ్ హీరోలు ఇషాన్ ఖట్టర్, ఆదిత్యారాయ్ కపూర్ లనుంచి విడిపోయిన తర్వాత వాకర్ బ్లాంకోతో మూడో డేటింగ్ కూడా ఫెయిల్ అవ్వడం ఇప్పుడు చర్చగా మారింది. ఇదిలా ఉంటే.. అనన్య పాండే మాజీ ప్రియుడు ఇషాన్ ఖట్టర్ కూడా తన భాగస్వామి చాందినీ బైన్స్‌తో దాదాపు మూడేళ్ల బంధానికి ముగింపు పలికినట్లు కథనాలు రావడం గమనార్హం. అయితే ఈ బ్రేకప్ వార్తలపై అనన్య కానీ, వాకర్ కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

### ఇందిరమ్మ ఇండ్లలో నిరుపేద ముస్లిం మహిళలకు అన్యాయం

# ఇండ్లు లేని పేదలకు 'ఎల్ 3' షాక్

## మహిళలకు న్యాయం చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు విహెచ్ లేఖ



అంబర్పేట్ ఆగస్టు 27(ప్రజాకలం న్యూస్)

ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న తమకు సొంత ఇండ్లు, కార్లు ఉన్నాయంటూ సంబంధిత అధికారులు తమ పేర్లను ఎల్ -3 కేటగిరిలో వేశారని అంబర్ పేట నియోజకవర్గం పటేల్ నగర్ డివిజన్ లోని అహ్మద్ నగర్ తదితర బస్తీలకు చెందిన పేద ముస్లిం మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.తమ పేర్ల మీద,కుటుంబ సభ్యుల పేర్లమీద సొంత ఇండ్లు, కార్లు,ఆస్తులు లేవని, అయినప్పటికీ అధికారులు తమ పేర్లను ఎల్-3 కేటగిరీలో వేసి దరఖాస్తులను తిరస్కరించారని వారు వాపోయారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ నాయకుడు బాబా గౌస్ పాషా ఆధ్వర్యంలో 60 మంది ముస్లిం మహిళలు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావును వారి నివాసంలో కలిసి తమకు న్యాయం చేయాలని వినతి పత్రం సమర్పించారు. అహ్మద్ నగర్ తదితర బస్తీల నిరుపేద కుటుంబానికి చెందిన తమకు సొంత ఇండ్లు లేవని,అద్దె ఇండ్లలో ఉంటున్నామని ముస్లిం మహిళలు తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడని,తాము కష్టపడి పనిచేసి జీవిస్తున్నామని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇండ్ల కోసం తాము రూ. 10 వేలు కట్టి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకొని, తమకు ఇండ్లు వస్తాయని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నామని వారు చెప్పారు.తీరా చూస్తే తమకు, తమ కుటుంబ సభ్యులకు లేని సొంత ఇండ్లు ఉన్నాయంటూ, కార్లు ఉన్నాయంటూ అధికారులు తమ పేర్లను ఎల్ -3 కేటగిరిలో వేసి రిజెక్ట్ చేశారని ముస్లిం మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి విచారణ చేయకుండా అధికారులు తమ పేర్లను రిజెక్ట్ చేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. దీనిపై మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ముస్లిం మహిళలు విజ్ఞప్తి చేశారు.

**లేఖ రాసిన విహెచ్**

దీనిపై స్పందించిన వి. హనుమంతరావు జిహెచ్ఎంసి డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మారుతి దివాకర్ తో ఫోన్లో మాట్లాడి ఆయనకు లేఖ రాశారు. అంబర్పేట నియోజకవర్గంలోని 60 మంది పేద, అర్హులైన మహిళలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపై పునర్విచారణ చేయాలని కోరారు. వీరంతా ఇందిరమ్మ ఇళ్లు (డబుల్ బెడ్రూమ్ ఇళ్లు) మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారని, అయితే తమకు సరైన రీతిలో సర్వే, విచారణ జరగలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని విహెచ్ తెలిపారు. వారికి సొంత ఇండ్లు,ద్విచక్ర వాహనాలు తదితర ఆస్తులు లేనప్పటికీ,వారి పేర్లను ఎల్ -3 కేటగిరీలో చేర్చినట్లు వారు పేర్కొంటున్నారని ఆయన లేఖలో తెలిపారు.

ఈ 60 మంది పేద దరఖాస్తుదారుల విషయంలో మరోసారి సమగ్రంగా పునర్విచారణ నిర్వహించి వారు వాస్తవంగా అర్హులని నిర్ధారించిన పక్షంలో వారి పేర్లను ఎల్ -3 కేటగిరీ నుంచి తొలగించి, అర్హులైన పేద కుటుంబాలకు న్యాయం చేయాలని వీహెచ్ లేఖలో కోరారు. ఈ కార్యక్రమంలో మహిళలు పర్వీన్ బేగం,షాహిన్ బేగం,సమీనా బేగం,జబీనా బేగం,అఫ్రోజ్ బేగం, అంజుమ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# రావిరాల ప్రభుత్వ పాఠశాలలో అరాచకం

### - ప్రభుత్వ డిజిటల్ మానిటర్ ధ్వంసం!
### - గుడిలాంటి బడిలో ధ్వంసం చేయడమేంటి





**మహేశ్వరం, ఆగస్టు 26,(ప్రజా కలం)**

రావిరాల గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాలలో గుర్తుతెలియని దుండగులు బీభత్సం సృష్టించారు. ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ మానిటర్ ను ఆకతాయిలు తాళ్లతో కొట్టి పూర్తిగా ధ్వంసం చేశారు.

**అసలేం జరిగింది?**

బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. రాత్రి వేళ స్కూల్ ఆవరణలోకి చొరబడిన ఆకతాయిలు మద్యం సేవించి, అక్కడ ఉన్న డిజిటల్ బోర్డుపై దాడి చేశారు. గురువారం ఉదయం పాఠశాల తెరిచేసరికి మానిటర్ పగిలిపోయి, ముక్కలు ముక్కలుగా కనిపించింది. దీంతో షాక్ కు గురైన ఉపాధ్యాయులు వెంటనే మహేశ్వరం పోలీసులకు సమాచారం ఇచ్చి ఫిర్యాదు చేశారు.

**సెక్యూరిటీ లేకపోవడమే ప్రధాన కారణం!**

పాఠశాలలో రాత్రి కాపలాదారు లేకపోవడమే ఈ దాడులకు కారణమని ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ రాత్రి కాగానే కొందరు ఆకతాయిలు స్కూల్ గ్రౌండ్ లోకి వచ్చి మద్యం తాగుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పాఠశాల ఆస్తిని ధ్వంసం చేస్తున్నారని గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామస్థుల డిమాండ్:**

1. ప్రభుత్వ పాఠశాలకు వెంటనే శాశ్వత సెక్యూరిటీ గార్డును నియమించాలి.
2. రాత్రివేళల్లో పోలీస్ పెట్రోలింగ్ ను ముమ్మరం చేయాలి.
3. పాఠశాల ఆస్తి ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలి.

ప్రభుత్వం పిల్లల భవిష్యత్తు కోసం అందించిన విలువైన డిజిటల్ పరికరాలను ఇలా నాశనం చేయడం దారుణమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 22ఏ తో రైతులకు శాపం వెంటనే రద్దు చేయాలి

- రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది
- 22ఏతో రైతులకు శాపం వెంటనే రద్దు చేయాలి బీజేపీ నేతల డిమాండ్
- రైతుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం.
- రంగారెడ్డి కలెక్టరేట్ ముందు బీజేపీ ధర్నా - రైతులకు న్యాయం చేయాలని డిమాండ్
- రంగారెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 26,(ప్రజా కలం)**

జి ఓ నంబర్ 22A కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఈ జి ఓ ను వెంటనే రద్దు చేయాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేసింది. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు నిరసన తెలిపి,జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.రంగారెడ్డి రూరల్, అర్బన్ జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి.

**రైతుల భూములపై ఆంక్షలు**

22, ఎ.జి ఓ వల్ల రైతుల భూములు ప్రొహిబిషన్ నిషేధిత జాబితాలో చేరాయని, దీనివల్ల రైతులు తమ భూములను అమ్ముకోలేక, తనఖా పెట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ రైతు సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు.





**కబ్జాదారులకు ఎన్ ఓ సి లు, రైతులకు నిర్లక్ష్యం**

నిషేధిత భూములు, వక్ఫ్ భూముల పేరుతో అసలైన రైతులు ఇబ్బంది పడుతుండగా, భూ కబ్జాదారులు మాత్రం అక్రమంగా భూములు స్వాధీనం చేసుకుని ఎన్ ఓ సి లు పొందుతున్నారని ఆరోపించారు. నిజమైన రైతులకు ఎన్ ఓ సి లు ఇవ్వని పరిస్థితిపై అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

**ఉద్యమానికి సిద్ధం**

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. అధికారులు సమస్యలను సమగ్రంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుళ్ల వీరేందర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, రాష్ట్ర నాయకుడు కొప్పు భాషా, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### ఎన్ఎంయూ నూతన గౌరవ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్

మల్కాజిగిరి ఆగస్టు 27(ప్రజా కలం ప్రతినిధి)



మల్కాజిగిరి మౌలాలి కుషాయిగూడ ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయూ యూనియన్ నూతనంగా ఎన్నికైన గౌరవ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్ గురువారం కార్మికులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిపోలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా పోతుల వినోద్ యాదవ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అవసరమైన సమస్యలను మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అనంతరం డిపో జనరల్ మేనేజర్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అమిత్, నరసింహ, జగదీష్, ప్రేమ్, మల్కాజిగిరి యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్, శివ, నరసింహ, నర్సింగ్, నాని, తనీష్, మిట్టు తదితరులు పాల్గొన్నారు.

### 22ఏ రేవంత్ రెడ్డి తీసుకున్న తుగ్లక్ నిర్ణయం

# పేదల ఇళ్లను కూల్చడం కాదు..

### సమస్యకు పరిష్కారం చూపాలి: ఎంపీ ఈటల రాజేందర్



మల్కాజిగిరి, ఆగస్టు 27(ప్రజా కలం ప్రతినిధి)

22ఏ నిషేధిత జాబితాలో నివాస ప్రాంతాలను చేర్చడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న తుగ్లక్ నిర్ణయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. నేరేడ్‌మెట్ డివిజన్ ఆర్కేపురంలో 22ఏ బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్కాజిగిరి మినీ ఇండియాగా మారిందని, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు. ఆర్కేపురం కాలనీ ఏర్పడి 61 సంవత్సరాలు పూర్తయిందని, దశాబ్దాలుగా నివసిస్తున్న ప్రజల ఇళ్లను ఇప్పుడు 22ఏ జాబితాలో చేర్చడం సరికాదన్నారు. ప్రభుత్వం ఒకవైపు ఇళ్లు లేని వారికి ఇళ్లు ఇస్తామని చెబుతూ, మరోవైపు సొంతంగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారికి హక్కులు లేకుండా చేస్తోందని ప్రశ్నించారు. హైడ్రా ఏర్పాటైన సమయంలోనే తాను దానిని వ్యతిరేకించానని, పేదల ఇళ్లను కూల్చే విధానం సరికాదని స్పష్టం చేశారు. గాజులరామారంలో దశాబ్దాలుగా నివసిస్తున్న పేదల ఇళ్లను కూల్చడంతో పాటు వారు ఏర్పాటు చేసుకున్న బోర్లు, విద్యుత్ స్తంభాలను తొలగించడం దారుణమన్నారు. పేదలపై మాత్రమే అధికార ప్రతాపం చూపడం ఎందుకని ప్రశ్నించారు. పెద్దల భూముల జోలికి వెళ్లకుండా పేదల గుడిసెలను తొలగించడం అన్యాయమని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు చేసిన వారు, భూములు విక్రయించిన మధ్యవర్తులు, అనుమతులు ఇచ్చిన అధికారులు ఎవరో గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మూసీ ప్రక్షాళన విషయంలోనూ తాను గతంలో పోరాటం చేశానని ఈటల రాజేందర్ గుర్తుచేశారు. విద్యార్థి దశ నుంచే మూసీ పరివాహక ప్రాంత సమస్యలపై పోరాడుతున్నానని,48 గంటల పాటు అక్కడే ఉండి కూల్చివేతలను అడ్డుకున్న సందర్భాన్ని ప్రస్తావించారు.

22ఏ వంటి భారీ నిర్ణయాలు తీసుకునే ముందు ప్రభుత్వం అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగతంగా ఎవరినీ విమర్శించడం లేదని, అయితే పాలకులు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఉండకూడదని సూచించారు. పేదల ఇళ్లకు,భూములకు రక్షణ కల్పించి 22ఏ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

# రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో హుండీ చోరీ

### -దర్జాగా హుండీ ని మాయం చేసిన దొంగలు
### - కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఆదిభట్ల పోలీసులు



మహేశ్వరం, ఆగస్టు 26,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని ప్రసిద్ధ చెందిన సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి అమ్మవారి గర్భాలయంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లాడు.స్థానికులు, ఆలయ వర్గాల కథనం ప్రకారం.. దొంగ బైక్ పై ఆలయానికి వచ్చి, ఎవరూ లేని సమయం చూసి దర్జాగా హుండీని ఎత్తుకెళ్లాడు. ఉదయం ఆలయానికి వచ్చిన పూజారికి హుండీ కనిపించకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది.సమాచారం అందుకున్న ఆలయ కమిటీ సభ్యులు ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆలయంలోని సీసీ కెమెరాల ఫుటేజీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఆలయంలో భద్రత కరువైందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చరిత్ర కలిగిన అమ్మవారి దొంగతనం జరగడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇకనుంచి ఆలయానికి గట్టి భద్రత ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీని పోలీసులను భక్తులు కోరుతున్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com